వార్తా పత్రికలు,
అధిక సంఖ్యలో పుస్తకముల ముద్రణ కోసం సంప్రదించండి.
9393949345.
విశాఖ సమాచారమ్ ప్రెస్
మల్టీకలర్ వెబ్ ఆఫ్‌సెట్ ప్రింటర్స్



VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM
Postal License No. VSP / 96/ 2021 - 23
visit: www.visakhasamacharam.com

# విశాఖ సమాచారమ్

RNI No.52722/90 సంపుటి : 33 సంచిక : 161 విశాఖపట్నం, 06 ఏప్రియల్ 2023 గురువారం E-mail : vspnews@gmail.com, పేజీలు : 8 వెల : రూ.2.00



విలేకరులు కావలెను
విశాఖ సమాచారమ్
తెలుగు దినపత్రికకు దిగువ తెలిపిన ప్రాంతములలో విలేకరులు కావలెను.
గాజువాక, పాయకరావుపేట, కోటవురట్ల, నర్సీపట్నం, అడ్డురోడ్డు, తాళ్లపాలెం, ఎస్.కోట, కొత్తవలస, పెందుర్తి, ఆనందపురం, తగరపువలస, విజయనగరం, శ్రీకాకుళం రూరల్.
సంప్రదించండి : 9393949345, 7013765256


## పొత్తుల కోసం వెంపర్లాడుతున్న చంద్రబాబు : అమర్నాథ్





అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): మీ కుటుంబాలకు నా తరఫున మంచి జరగకపోతే ఓటు వేయద్దు" ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఈ మాట చెప్పారంటే జనంలో ఆయనకు బలం ఉంది కాబట్టే అంత ధైర్యంగా ఆ మాట చెప్పారని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ అన్నారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అన్నిటినీ నెరవేర్చారు కాబట్టే ప్రజల ఆశీస్సులతో వచ్చే ఎన్నికలలో వైసీపీకి 175 కి 175 సీట్లు గెలుస్తామన్న మనో నిబ్బరంతో జగన్మోహన్ రెడ్డి ఉన్నారని అన్నారు. డ్వాక్రా మహిళల రుణమాఫీ కోసం ప్రవేశపెట్టిన ఆసరా పథకం కింద కసింకోట మండలంలో 13 కోట్ల 31 లక్షల రూపాయల చెక్కును డ్వాక్రా మహిళలకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనానికి మేలు చేశారు కాబట్టే జగన్మోహన్ రెడ్డి ధైర్యంగా ఓటు అడుగుతున్నారని, చంద్రబాబు నాయుడు తన పదవీకాలంలో ప్రజలకు ఏం మేలు చేశాడని ఓటు అడగడానికి వస్తున్నాడని ప్రశ్నించారు. గత ఎన్నికలకు ముందు పసుపు, కుంకుమ కింద డబ్బులు బ్యాంకులో జమ చేస్తున్నామని చెప్పిన చంద్రబాబు ఆ మొత్తాన్ని డ్వాక్రా మహిళలు వినియోగించుకోలేని విధంగా ఆదేశాలు జారీ చేశాడంటే ఆయన ఎంత మోసగాడో అర్థం చేసుకోవచ్చని అన్నారు. పసుపు కుంకుమ పేరుతో చంద్రబాబు మోసం చేస్తే ... ఉప్పు, కారంతో ఆయనకు మహిళలు బుద్ధి చెప్పారని అమర్నాథ్ అన్నారు. చంద్రబాబు నాయుడు 175 స్థానాల్లో పోటీ చేసే సత్తా లేక వివిధ పార్టీలతో పొత్తుల కోసం వెంపర్లాడుతున్నాడని, అటువంటి వ్యక్తి గురించి జనం ఆలోచించాల్సిన అవసరం లేదని అమర్నాథ్ విజ్ఞప్తి చేశారు. జనానికి మేలు చేస్తున్న జగన్మోహన్ రెడ్డిని విమర్శించడమే పనిగా పెట్టుకున్న విపక్షాలు చెప్పే కల్లబొల్లి మాటలను నమ్మొద్దని ఆయన కోరారు.

పేద, బడుగు, బలహీన వర్గాల వారి అభ్యున్నతి కోసం పాటుపడిన మహనీయులను స్ఫూర్తిగా తీసుకొని జగన్మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో రెండు లక్షల 96 వేల కోట్ల రూపాయలు సంక్షేమ కార్యక్రమాలకు వినియోగిస్తున్నారని, స్వతంత్ర వచ్చిన తర్వాత రాష్ట్రాన్ని పాలించిన ఏ ముఖ్యమంత్రి అయిన ఇంత పెద్ద మొత్తాన్ని ఖర్చు చేశారా? అని మంత్రి అమర్నాథ్ ప్రశ్నించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో 65 లక్షల మందికి ప్రతి నెల ఇళ్లకే పింఛన్ అందిస్తున్న ఘనత జగన్మోహన్ రెడ్డికే దక్కిందని ఆయన అన్నారు. కసింకోటలో ఆ ప్రభుత్వం 600 కు పైగా ఇళ్ల పట్టాలని అందజేసిందని, గతంలో ఎవరైనా ఇంత సాహసం చేశారా? అని అమర్నాథ్ ప్రశ్నించారు. రాష్ట్రంలో పేద ప్రజలు బాగుపడితే రాష్ట్రం బాగుపడుతుందన్న ఉద్దేశంతో జగన్మోహన్ రెడ్డి పేదల అభ్యున్నతి కోసం శ్రమిస్తున్నారని అన్నారు. అర్హత ఉన్న ప్రతి వ్యక్తికి సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా జగన్మోహన్ రెడ్డి పని చేస్తున్నారని అన్నారు. గత ఎన్నికల్లో తనను అనకాపల్లి నియోజకవర్గం నుంచి గెలిపించి జగన్మోహన్ రెడ్డితో కలిసి పనిచేసే అవకాశం కల్పించినందుకు ఈ ప్రాంత ప్రజలకు అమర్నాథ్ కృతజ్ఞతలు తెలియజేశారు. వచ్చే ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని తిరిగి అధికారులకు తీసుకురావాలని అమర్నాథ్ విజ్ఞప్తి చేశారు.

వైఎస్‌ఆర్సిపి రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్ మాట్లాడుతూ, జగన్మోహన్ రెడ్డి తన పాదయాత్రలో డ్వాక్రా మహిళల రుణ బాధలను తెలుసుకొని, ఆయన అధికారంలోకి వచ్చిన వెంటనే

(మిగతా 2లో)

## 'స్టాండప్ ఇండియా' పథకం ఎస్సీ, ఎస్టీ మహిళా వర్గాల్లో వ్యవస్థాపకతను ప్రోత్సహించే ఒక కీలక మైలురాయి : నిర్మలా సీతారామన్



దేశవ్యాప్తంగా అట్టడుగు స్థాయిలో ఆర్థిక సాధికారత, ఉద్యోగ సృష్టి కోసం వ్యవస్థాపకతను ప్రోత్సహించే ధ్యేయంతో 2016 ఏప్రిల్ 5న స్టాండప్ ఇండియా పథకానికి కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిన నేపథ్యంలో ఇప్పుడు 2025దాకా పొడిగించబడింది.

శక్తిమంతులు, ఉత్సాహవంతులైన ఔత్సాహిక ఎస్సీ, ఎస్టీ, మహిళా పారిశ్రామికవేత్తలు తమ కలను సాకారం చేసుకోవడంలో అనేక సవాళ్లను ఎదుర్కొనాల్సి ఉంటుందని ప్రభుత్వం గుర్తించింది. అందుకే ఆ వర్గాలలో వ్యవస్థాపకతను ప్రోత్సహించడానికి స్టాండప్ ఇండియా పథకాన్ని ప్రారంభించింది. తయారీ, సేవలు లేదా వ్యాపార, వ్యవసాయరంగ అనుబంధ కార్యకలాపాలలో సరికొత్త (హరిత క్షేత్ర) సంస్థలను ప్రారంభించేలా ఈ పథకం వారికి చేయూతనిస్తుంది. 'స్టాండప్ ఇండియా' పథకం ఇవాళ్టితో ఏడేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కేంద్ర ఆర్థిక-కార్పొరేట్ వ్యవహారాల శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ- "దేశవ్యాప్తంగా 1.8 లక్షల మందికి పైగా మహిళలు, ఎస్సీ/ఎస్టీ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు కోటికిపైగా రుణ ఖాతాల కింద రూ.40,600 కోట్లకుపైగా రుణాలు మంజూరు చేయడం నాకెంతో గర్వంగానూ, సంతృప్తిగానూ ఉంది" అని సంతోషం వ్యక్తం చేశారు.

"ఈ పథకం ఒక వినూత్న పర్యావరణ వ్యవస్థను సృష్టించింది. తద్వారా అన్ని షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకుల శాఖల నుంచి రుణాలు పొంది, హరిత క్షేత్ర ప్రాజెక్టులు ప్రారంభించేలా సహాయక వాతావరణం ఏర్పరచి నేటికీ కొనసాగిస్తోంది. ఆ విధంగా స్టాండప్ ఇండియా పథకం ఎస్సీ, ఎస్టీ, మహిళా వర్గాల్లో వ్యవస్థాపకతను ప్రోత్సహించే ఒక కీలక మైలురాయిగా తననుతాను రుజువు చేసుకుంది" అని ఆర్థికశాఖ మంత్రి పేర్కొన్నారు. ఇప్పటిదాకా అవకాశాలు అందని, అణగారిన వర్గాల ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఎలాంటి అవరోధాల్లేని, సులభ రుణపరపతి కల్పించడం ద్వారా ఈ పథకం అనేకమంది జీవితాల్లో వెలుగులు నింపిందని సీతారామన్ అన్నారు. ఈ మేరకు వారు వ్యవస్థాపక ప్రతిభను, నైపుణ్యాన్ని చాటుకునేలా వారి ఆశలకు రెక్కలు తొడిగిందని వివరించారు. అంతేకాకుండా ఆర్థిక వృద్ధిని నడిపించగలవారుగా, ఉద్యోగ సృష్టికర్తలుగా బలమైన పర్యావరణ వ్యవస్థను నిర్మించేవారుగా ఆ వ్యవస్థాపకులను తీర్చిదిద్దిందని ఆర్థిక మంత్రి అన్నారు.

'స్టాండప్ ఇండియా'పథకం 7వ వార్షికోత్సవం సందర్భంగా కేంద్ర ఆర్థిక-కార్పొరేట్ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి శ్రీ భగవత్ కిషన్‌రావు కరద్ మాట్లాడుతూ- "జాతీయ ఆర్థిక సార్వజనీనత మిషన్‌కు మూడో స్తంభం గాగల "నిధులందని

(మిగతా 2లో)

## జూన్ నాటికి తిరుపతి ఐఐటి క్యాంపస్ సిద్ధం

న్యూఢిల్లీ: ఈ ఏడాది జూన్ 30 నాటికి తిరుపతి ఐఐటి క్యాంపస్‌లో నిర్మాణాలన్నింటినీ సిద్ధం చేసి అప్పగిస్తామని విద్యాశాఖ సహాయ మంత్రి డాక్టర్ సుభాస్ సర్కార్ వెల్లడించారు. రాజ్యసభలో బుధవారం వైఎస్సార్సీపీ సభ్యులు శ్రీ వి.విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి రాతపూర్వకంగా జవాబిస్తూ తిరుపతి ఐఐటి క్యాంపస్‌లో నిర్మాణ పనులు ఈనెలాఖరులోగా పూర్తి కావలసి ఉందని తెలిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి దేశంలోని ఐఐటిలు అన్నింటికి కలిపి 9361 కోట్ల రూపాయలను కేటాయించినట్లు మంత్రి చెప్పారు.

ఈ ఆర్థిక సంవత్సరంలో తమకు 407 కోట్ల రూపాయలు కేటాయించవలసిందిగా తిరుపతి ఐఐటి యాజమాన్యం కోరింది. అయితే తిరుపతి ఐఐటికి ఎంత మొత్తం కేటాయించాలన్న అంశం ఇంకా మంత్రిత్వ పరిశీలనలోనే ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. ఐఐటిలకు కేటాయించిన 9361 కోట్ల రూపాయల నుంచే సిబ్బంది జీతభత్యాలు, పెన్షన్లు, స్కాలర్‌షిప్‌లు, కాంట్రాక్ట్ సిబ్బందికి వేతనాలు, చిన్న చిన్న పరికరాలు, లైబ్రరీ పుస్తకాలు, వడ్డీ చెల్లింపులు వంటి వాటి చెల్లింపుల కోసం ఉద్దేశించినవని మంత్రి చెప్పారు.

## 175 సీట్లలో వైసీపీని ఓడిస్తాం- వైజాగ్ జోనల్ సదస్సులో చంద్రబాబు

విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): విశాఖలో బుధవారం జరిగిన టీడీపీ జోన్ 1 సమావేశంలో పార్టీ అధినేత చంద్రబాబు కీలక వ్యాఖ్యలు చేశారు. ముఖ్యంగా ఎమ్మెల్సీ ఎన్నికల గెలుపు, అనంతర పరిణామాలు, వచ్చే ఎన్నికల్లో వైసీపీని ఎలా ఎదుర్కొంటామన్న దానిపై చంద్రబాబు కీలక వ్యాఖ్యలు చేశారు. గత టీడీపీ ప్రభుత్వంతో వైసీపీ సర్కార్ పాలనను పోలుస్తూ కార్యకర్తల్ని ఉత్సాహపరిచారు.

మొన్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో వచ్చింది శాంపిల్ గెలుపు మాత్రమేనని, వచ్చే ఎన్నికల్లో పెద్ద విజయం ఖాయమని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు.



ఎమ్మెల్సీ ఎన్నికల్లో కేవలం 20 రోజుల ముందు అభ్యర్థిని ప్రకటించినా ప్రజలు మద్దతు పలికి గెలిపించారన్నారు. ఒక గెలుపు విజయం ఇస్తుంది...ఒక గెలుపు కుంగదీస్తుందంటూ వైసీపీని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపు పార్టీకి జోష్ ను ఇచ్చిందన్నారు. వైసీపీ అంటున్నట్లు వై నాట్ 175 కాదు...ఇప్పుడు చెపుతున్నా వై నాట్ పులివెందుల అన్నారు.

టీడీపీతో పెట్టుకున్న జగన్ ను చిత్తు చిత్తుగా ఓడించి బంగాళాఖాతంలో కలుపుతారని చంద్రబాబు జోస్యం చెప్పారు. పార్టీ ఎమ్మెల్యేలను జగన్ నిన్నటి వరకు హీనంగా చూశాడని, ఇప్పుడు వారికి గౌరవం ఇస్తాను అంటున్నాడని గుర్తుచేశారు. మనకు గత ఎన్నికల్లో 23 సీట్లు వస్తే ఇది దేవుడి స్క్రిప్ట్ అని హేళన చేశాడని,

(మిగతా 2లో)

## ప్రణాళికాబద్దంగా జిల్లా అభివృద్ధి

పార్వతీపురం, (విశాఖ సమాచారమ్): కొత్తగా ఏర్పడిన పార్వతీపురం అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తున్నట్లు డిప్యూటీ ముఖ్యమంత్రి మరియు గిరిజన సంక్షేమ శాఖమంత్రి పీడికరాజన్న దొర తెలిపారు. బుధవారం కలెక్టరు కార్యాలయంలో మెయిన్ రోడ్డునుండి నూతనంగా నిర్మించిన కార్యాలయ ముఖద్వారం ప్రారంబించారు. అనంతరం కలెక్టరు కార్యాలయ సమావేశమందిరంలో ఏర్పాటుచేసిన పత్రికా విలేఖరుల సమావేశంలో గత సంవత్సర కాలంగా జిల్లాలో చేపట్టిన ప్రగతిని వివరించారు. దశల వారీగా జిల్లాను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. జిల్లాకు 600 కోట్లరూపాయలతో వైద్య కళాశాల మంజూరైనట్లు ఆయన తెలిపారు. నూతన కలెక్టరు కార్యాలయం మరియు వైద్య కళాశాల నిర్మాణానికి అవసరమైన భూములను గుర్తించడం జరిగిందని, ప్రభుత్వం నుండి అనుమతులు వచ్చిన వెంటనే పనులు మొదలు పెట్టనున్నట్లు తెలిపారు. కలెక్టర్ కార్యాలయం మరియు ఇతర జిల్లా కార్యాలయాల నిర్మాణం కోసం పార్వతీపురం మండలం, అడ్డాపుశీల గ్రామంలో ఎ.59.87 సెంట్ల విస్తీర్ణం గుర్తించబడిందని తెలిపారు. 2928 బలహీన వర్గాల ప్రజలకు ప్రభుత్వ భూమిని పంపిణీ చేసేందుకు ఎ.2283.96 సెంట్ల విస్తీర్ణం సేకరించడం జరిగిందనన్నారు. "జగనన్న శాశ్వత



భూ హక్కు మరియు భూ రక్ష" కార్యక్రమం క్రింద 21353 పట్టాదార్ పాస్ పుస్తకాలు పంపిణీ చేయబడ్డాయని, దీని కోసం 6.10 లక్షలరూపాయలు

(మిగతా 2లో)

## అంటరాని వారికి సమానత్వం కోసం "ఆల్ ఇండియా డిప్రెస్డ్ క్లాసెస్ లీగ్" స్థాపించిన బాబూ జగ్జీవన్ రామ్



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): అణగారా వర్గాల అభ్యుదయానికి బాబూ జగ్జీవన్ రామ్ కృషి ఎనలేనిదని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి పేర్కొన్నారు. బుధవారం ఆమె పాం బీచ్ ఎదురుగా ఉన్న బాబూ జగ్జీవన్ రామ్ 116వ జయంతి సందర్భంగా జిల్లా కలెక్టర్ ఏ మల్లికార్జున, జాయింట్ కలెక్టర్ విశ్వనాధ్, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ సుభద్ర, సోషల్ వెల్ఫేర్ చైర్మన్, ఇతర ప్రభుత్వ అధికారులు పలువురు నాయకుల తో కలిసి ఆయన విగ్రహానికి పూలమాల లేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ అణగారా వర్గాల అభ్యుదయానికి బాబూ జగ్జీవన్ రామ్ కృషి ఎనలేనిదని, అంతేకాకుండా స్వాతంత్ర్య సమర యోధులు, సంఘ సంస్కర్త. రాజకీయవేత్త. బీహార్లోని వెనుకబడిన వర్గాలనుంచి వచ్చి ఈ దేశానికి ఎన్నో సేవలను అందించారని తెలిపారు.అతను బాబూజీగా ప్రసిద్దుడు. భారత పార్లమెంటులో నలభై ఏళ్ళపాటు వివిధ మంత్రి పదవులు నిర్వహించడమే కాకుండా, ఉపప్రధానిగా వ్యవహరించారని,1935లో అంటరాని వారికి సమానత్వం కోసం అంకితమైన "ఆల్ ఇండియా డిప్రెస్డ్ క్లాసెస్ లీగ్" అనే సంస్థను స్థాపించడంలో ఆయన కీలక పాత్ర పోషించారని, 1937లో బీహార్ శాసనసభకు ఎన్నికయ్యి, ఆ తర్వాత గ్రామీణ కార్మిక ఉద్యమాన్ని నడిపారని తెలిపారు. 1946లో జవహర్‌లాల్ నెహ్రూ తాత్కాలిక ప్రభుత్వంలో అతి పిన్న వయస్కుడైన మంత్రిగా

(మిగతా 2లో)


Sugar Free
Fitearly
నడివయస్కులకు దివ్య శక్తి
ఫిట్ ఎర్లీ
थकावट से सत्वर उपसमन
फिट एर्ली
వివిధ వృత్తి, ఉద్యోగాలలో అలసటకు లోనై నీరసించి పోతున్నారా?
మందులు మింగలేక, చక్కెరతో కూడిన ఎనర్జీ బూస్టర్లు సేవించలేకపోతున్నారా?
దిగులు చెందకండి.
"ఫిట్ ఎర్లీ" మిమ్మల్ని నిరంతరం శక్తివంతం గాను, ఉత్సాహవంతంగాను ఉంచుతుంది.
సోయప్రోటీన్,
వే ప్రోటీన్,
బ్రాహ్మి,
హరితకి,
సీ భక్తారన్,
శొంఠి,
తులసి,
అశ్వగంధ
తదితర హిమాలయముల నుండి సేకరించిన విశిష్ట వన మూలిక సమ్మిళితమైన "ఫిట్ ఎర్లీ" విశిష్టానుభవం గల పరిశోధకులచే రూపొందించబడింది. అంతేకాక ప్రఖ్యాత వైద్యరంగ పరిశోధన శాలలో అన్ని విధములుగా పరీక్షించబడి సంతృప్తి కరమైన ఫలితాలను ప్రకటించుకోబడిన ఉపాహారం

ఆంధ్రప్రదేశ్‌లో డీలర్‌షిప్ వివరాలకు సంప్రదించండి
ఎస్.వీరభద్రరావు : సెల్: 8247526179
ఈ-మెయిల్: surampudi43@gmail.com
HERBINDO LABS PVT LTD.
2-2-642/1/1/1A, Sadguru Krupa,
Street No 16,
Amberpet, Hyderabad - 500013,
Telangana, India
E-Mail: herbindolabs@gmail.com
Mob: +91 9704885252
GSTN: 36AAECH6684G1ZA
CIN: U24100TG2018PTC127052

# దగ్గుబాటి కుటుంబంలో విషాదం



దగ్గుబాటి కుటుంబంలో విషాదం చోటు చేసుకుంది. ప్రముఖ నిర్మాత దివంగత రామానాయుడు తమ్ముడు రామమోహనరావు అలియాస్ మోహన్‌బాబు (73) కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన స్వగ్రామం బాపట్ల జిల్లా కారంచేడులోని నివాసంలో మంగళవారం తుదిశ్వాస విడిచారు. రామానాయుడు పెద్ద కుమారుడు, ప్రముఖ నిర్మాత సురేశ్‌బాబు తన కుటుంబంతో కలిసి కారంచేడు చేరుకుని మోహన్‌బాబు భౌతికకాయానికి నివాళులర్పించారు.

సినిమా చిత్రీకరణ కోసం ముంబయిలో ఉండడంతో వెంకటేశ్ వెళ్లలేకపోయినట్టు తెలుస్తోంది. బుధవారం ఆయన తన బాబాయ్ పార్థివ దేహానికి నివాళి అర్పించనున్నారు. మోహన్‌బాబు మృతి పట్ల పలువురు రాజకీయ, సినీ ప్రముఖులు దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు. మోహన్‌బాబు కూడా నిర్మాతగా వ్యవహరించారు. 'ఒక చల్లని రాత్రి' సినిమాని నిర్మించిన ఆయన మరో రెండు చిత్రాలను భాగస్వామ్యంతో రూపొందించారు. చీరాలలోని ఓ థియేటర్‌లో ఆయనకు భాగస్వామ్యం ఉంది.

# పవన్ కల్యాణ్ నిలకడలేని మనిషి : ఆదిమూలపు

జనసేన అధినేత పవన్ కళ్యాణ్ నిలకడ లేని మనిషి అని, ఆయన రాజకీయ వ్యభిచారం చేస్తున్నారంటూ రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ సంచలన వ్యాఖ్యలు చేశారు. భారతీయ జనతాపార్టీతో అంటకాగుతూనే, మరోవైపు తెలుగుదేశం పార్టీ ముసుగులో పని చేస్తున్నారని ఆరోపించారు. అసలు పవన్ కళ్యాణ్ ఎన్ని స్థానాల్లో పోటీ చేస్తున్నాడో.. ఎవరితో పొత్తు పెట్టుకుంటున్నారో, ఎవరితో పొత్తు పెట్టుకోవాలనుకుంటున్నారో రాష్ట్ర ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాల తర్వాత తెలుగు దేశం పార్టీ నాయకులు వాపుని చూసుకుని బలుపు అనుకుంటున్నారని మంత్రి ఎద్దేవా చేశారు. తమతో వైసీపీ ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నారని టీడీపీ నేతలు చెబుతున్నారని.. ఆ ఎమ్మెల్యేలెవరో చెప్పాలని సవాల్ విసిరారు. 175 నియోజకవర్గాల్లో టీడీపీకి అభ్యర్థులే లేరని.. అందుకే ఆ పార్టీ పొత్తులకు వెళుతోందన్నారు.

రాష్ట్రంలో ముందస్తు ఎన్నికలు లేవని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పూర్తి స్పష్టత ఇచ్చారని, వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలోని 175 స్థానాల్లోనూ వైసీపీ అభ్యర్థులు పోటీ చేస్తారని మంత్రి చెప్పారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో సీమెన్స్ స్కామ్ బయటపడిందని, 300 కోట్ల రూపాయల మేరకు కుంభకోణం జరిగిందని, ఈ విషయంలో చట్టం తన పని తాను చేసుకుపోతుందన్నారు.

# పాదయాత్రలో నారా లోకేశ్ కు తప్పిన ప్రమాదం

టీడీపీ యువనేత నారా లోకేశ్ యువగళం పాదయాత్ర ఈరోజు రాప్తాడు, ఉరవకొండ నియోజకవర్గాల్లోని వివిధ ప్రాంతాల్లో కొనసాగింది. ప్రజా సమస్యలను తెలుసుకుంటూ ఆయన పాదయాత్ర ముందుకు సాగింది. ఉరవకొండ నియోజకవర్గం కూడేరులో లోకేశ్ కు ప్రమాదం తప్పింది. పాదయాత్ర సందర్భంగా కూడేరులో టీడీపీ అభిమానులు లోకేశ్ ను గజమాలతో సత్కరించే సమయంలో ప్రమాదం చోటు చేసుకుంది.

భారీ గజమాలను క్రేన్ సహాయంతో లోకేశ్ కు వేసేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో క్రేన్ వైర్లు తెగాయి. దీంతో, మాల ఆయనపై పడింది. అయితే లోకేశ్ వెంటనే అప్రమత్తమై తప్పించుకున్నారు. దీంతో, ఆయనకు ప్రమాదం తప్పింది. లోకేశ్ కు ఏమీ కాకపోవడంతో అక్కడున్న టీడీపీ శ్రేణులు ఊపిరి పీల్చుకున్నాయి.

# ఆటో యూనియన్ కు అండగా ఉంటా : ఎమ్మెల్యే ద్వారంపూడి



**కాకినాడ, (విశాఖ సమాచారమ్):** పిడుగులమ్మ తల్లి ఆటో యూనియన్...ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి,వారి అభివృద్ధి,సంక్షేమానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తరపున తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు.కాకినాడ సంజయ్ నగర్ లో శ్రీ పిడుగులమ్మ తల్లి ఆటో ఓనర్స్ అండ్ డ్రైవర్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ కాకినాడలో ఉన్న 43 ఆటో యూనియన్ లలో అధిక శాతం యూనియన్లు తమ కష్ట కాలంలో కూడా అండగా నిలబడ్డాయన్నారు.ఎప్పుడు ఏ ప్రభుత్వాలు ఆలోచించని విధంగా ఆటో కార్మికుల ఆలోచించి,వాహన మిత్ర ద్వారా రూ.10వేలు ఆర్థిక సహాయం అందజేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. అదేవిధంగా తోటి కార్మికుడు సయ్యద్ మరణించిన నేపథ్యంలో ఆ కుటుంబాన్ని ఆదుకునేందుకు ఆటో కార్మికులంతా తమ సొంత డబ్బులు వేసుకొని ముందుకు రావడం అంతేకాకుండా 12వ డివిజన్ ఇంచార్జి మట్టపర్తి రఘురాం ఆ పిల్లలకు సంవత్సరానికి 14,500 స్కూలు ఫీజులు కడుతున్నట్లు ఆయన తెలియజేశారు ఎంతో అభినందనీయమన్నారు.మృతి చెందిన ఆటో కార్మికుడు సయ్యద్ కుటుంబాన్ని ప్రభుత్వం తరపున అన్ని విధాల ఆదుకుంటామని హామీ ఇచ్చారు.శ్రీ పిడుగులమ్మ తల్లి ఆటో ఓనర్స్ అండ్ వర్కర్స్ సంక్షేమ సంఘాన్ని ఇతర యూనియన్లు ఆదర్శంగా తీసుకోవాలన్నారు.గత రెండేళ్లుగా కరోనా కారణంగా మేడే వేడుకలు సరిగ్గా నిర్వహించనున్నందున,రానున్న మేడే వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు.అనంతరం సయ్యద్ కుటుంబ సభ్యులకు రూ.2లక్షల చెక్కును అందజేసి,పేదలకు దుప్పట్లు,చీరలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో కుడా చైర్ పర్సన్ రాగిరెడ్డి చంద్రకళ దీప్తి,నగర అధ్యక్షురాలు సుంకర శివ ప్రసన్న,శ్రీ పిడుగులమ్మ తల్లి ఆటో ఓనర్స్ అండ్ డ్రైవర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు కె.శ్రీనివాస్, ఉపాధ్యక్షురాలు వీరమణి,కార్యదర్శి ఆదినారాయణ,జాయింట్ సెక్రటరీ గోపి,కోశాధికారి నీలాపు సతీష్ కుమార్,వాసు,సభ్యులు రాజు, సతీష్,నౌషాద్,స్థానిక వైసీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి అనుచరులు విద్యార్థులపై దాడి చేయడానికి ఖండిస్తున్నాం



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** డాక్టర్ బాబు జగజీవన్ రామ్ జయంతి సందర్భంగా బుధవారంస్థానిక జార్జ్ క్లబ్ వద్ద జగజీవన్ రామ్ విగ్రహానికి అమర్నాథ్ నివాళులు అర్పించేందుకు వచ్చిన సందర్భంగా జై జనసేన అనీ నినాదం చేసిన విద్యార్థులపై పోలీసులుచే దాడి చేయించిన అమర్నాథ్ చర్యలు హేయమైనవని జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి ,అనకాపల్లి నియోజకవర్గ ఇన్చార్జ్ పరుచూరి భాస్కరరావు విమర్శించారు. జిల్లా కలెక్టర్ జాయింట్ కలెక్టర్ ఉన్న కార్యక్రమంలో మంత్రి విద్యార్థులపై పోలీసులు వైసీపీ నాయకులు చేతదాడి చేయించడం మంత్రి అసహనాన్ని తెలియజేస్తుందన్నారు. కళాశాల యాజమాన్యం అనుమతి లేకుండా కళాశాలలో చొరబడి విద్యార్థులను కొట్టడం ఎంతవరకు సబబని ఆయన ప్రశ్నించారు. ఒక విద్యార్థి జనసేన జిందాబాద్ అన్నందుకే మంత్రి సహనం కోల్పోతే తమ పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ పై నాలుగేళ్లుగా ఇష్టానుసారంగా విమర్శలు చేస్తున్న వైసీపీ నాయకులపై తమ పార్టీ ఎటువంటి చర్యలకు పాల్పడాలని ఆయన అన్నారు. ఇకపై అమర్నాథ్ పవన్ కళ్యాణ్ పై విమర్శలు చేస్తే జన సైనికులు, వీర మహిళలు ,అభిమానుల ఆగ్రహాన్ని చవి చూస్తారు అన్నారు. వైసిపి నాయకులు పద్ధతి మార్చుకోకపోతే జనసైనికులు ఆగ్రహాన్ని చవి చూడాల్సి వస్తోందన్నారు. రాజకీయాలలో ఆవేశాలు అసహనాలు పనికిరావని సంయమనం పాటించాలని అన్నారు. విద్యార్థులపై అమర్నాథ్ చేయించిన దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని. ఈ సంఘటనపై అనకాపల్లి డిఎస్పి కి వినతి పత్రం సమర్పిస్తున్నామని తెలిపారు. అలాగే వైసిపి పోలీసుల దాడులలో దెబ్బలు తిన్న విద్యార్థుల ఇంటికి వెళ్లి పరామర్శిస్తామని చెప్పారు.

# లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లోకి గ్రీన్ ఇండియా ఛాలెంజ్ సృష్టికర్త



బీఆర్ఎస్ ఎంపీ జోగినిపల్లి సంతోష్ కుమార్ చేపట్టిన గ్రీన్ ఇండియా ఛాలెంజ్ మరో ఘనతను సాధించింది. ప్రతిష్టాత్మక లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో గ్రీన్ ఇండియా ఛాలెంజ్ స్థానం దక్కించుకుంది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న భారతీయుల అపార కృషిని నిక్షిప్తం చేసే లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో గ్రీన్ ఇండియా ఛాలెంజ్ సృష్టికర్త, రాజ్యసభ సభ్యుడు జోగినిపల్లి సంతోష్ కుమార్‌కు చోటు లభించింది.

ఈ ఛాలెంజ్‌లో భాగంగా ఒక గంటలో అత్యధిక మొక్కలు నాటించే బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టినందుకు ఎంపీ సంతోష్ కుమార్‌కు రికార్డ్స్‌లో చోటు కల్పించినట్లు లిమ్కా బుక్ రికార్డ్స్ ఎడిటర్ వత్సాల కౌల్ బెనర్జీ వెల్లడించారు. ఈ మేరకు ప్రశంస పత్రం ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా ఎంపీకి అందించినట్లు ప్రకటించారు.

ఆదిలాబాద్ జిల్లా దుర్గానగర్‌లో 2021 జులై 4న సంతోష్ కుమార్ ప్రత్యేక చొరవతో ఒక గంట సమయంలో 16,900 మంది భాగస్వాములతో 3,54,900 మొక్కలు నాటినట్లు సంస్థ తెలిపింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరు 21 మొక్కలు నాటినట్లు ఆ సంస్థ పేర్కొంది. సమష్టి కృషి, సామాజిక స్పృహకు ఈ కార్యక్రమం నిలువెత్తు నిదర్శనమని ప్రశంసించింది.

లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్సులో గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌కు చోటు లభించడం, సీఎం చేతుల మీదుగా రికార్డు ప్రతిని అందుకోవడం తనపై మరింత బాధ్యత పెంచిందని ఎంపీ సంతోష్ కుమార్ అన్నారు. లిమ్కా బుక్‌లో చోటు దక్కడానికి ప్రధాన కారణం ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అని తెలిపారు. సీఎం కేసీఆర్ స్ఫూర్తితో జోగు రామన్న తన పుట్టిన రోజున గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో భాగంగా మొక్కలు నాటాలనే సంకల్పం తీసుకుని ఒక గంటలోనే 3.5 లక్షల మొక్కలు నాటించారని చెప్పారు. రామన్నకు, ఆయన బృందానికి సంతోష్ కుమార్ ట్విట్టర్ వేదికగా కృతజ్ఞతలు తెలిపారు.

గురువారం 06-04-2023
శోభకృత్ నామ సంవత్సరము
ఉత్తరాయణం వసంత రుతువు
చైత్ర మాసం

పంచాంగం

| | |
|---|---|
| తిథి | : శు. పూర్ణిమ ఉ. 09.42 |
| నక్షత్రం | : హస్త ప. 12.35 |
| వర్జ్యం | : రా. 08.53 ల 10.32 |




సమస్యలతో సతమతమవడం కంటే సాధకుల సహాయం కోరుట మేలు.

బ్రహ్మశ్రీ హనుమద్దాస్ స్వామీజీ గారు ప్రస్తుతం చెన్నైలో ఉన్నారు.

సెల్ : 9440537607


# కాజల్ అగర్వాల్ గెస్ట్ గా సూపర్ క్వీన్ 2 ప్రారంభోత్సవం ఈ ఆదివారం జీ తెలుగులో!

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** జీవితంలో విజేతలై నిలిచి ప్రేక్షకుల మనసులలో తమకంటూ ఓ స్థానాన్ని సంపాదించుకున్న పదిమంది నటీమణులతో 'సూపర్ క్వీన్' అనే రియాలిటీ షోను ప్రారంభించింది. తెలుగు రాష్ట్రాల ప్రేక్షకుల అపూర్వ ఆదరణతో విజయవంతమైన ఈ రియాలిటీ షో రెండో సీజన్ మరోసారి మీ ముందుకు రాబోతోంది. ప్రేక్షకులకు వినోదం పంచుతూనే టైటిల్ కోసం పదిమంది మహిళామణుల మధ్య జరిగే పోరాటమే సూపర్ క్వీన్ 2. ఏప్రిల్ 09న మధ్యాహ్నం 12 గంటలకు టాలీవుడ్ చందమామ కాజల్ అగర్వాల్ చేతుల మీదుగా ఘనంగా ప్రారంభం కానుంది. సూపర్ క్వీన్ 2, ఏప్రిల్ 16 నుంచి ప్రతి ఆదివారం ఉదయం 11 గంటలకు, మీ జీ తెలుగులో!

ఈ సీజన్లో విద్యుల్లేఖ రామన్, లిఖిత మూర్తి, మౌనిక యాదవ్, ఎస్తర్, ప్రియాంక, సుస్మిత, పవిత్ర, ప్రశాంతి, సుహాసిని వంటి బుల్లితెర నటీమణులతోపాటు తన డ్యాన్స్ అభిమానులను సంపాదించుకున్న కండక్టర్ ఝాన్సీ కిరీటం కోసం పోటీపడనుంది. ప్రతిభ, ఆత్మవిశ్వాసం, పోటీతత్వం గల ఈ పదిమంది మహిళామణులు తామేంటో నిరూపించుకునేందుకు సిద్ధమయ్యారు. ఇక, ఈ కార్యక్రమానికి ఎవర్‌గ్రీన్ ఎనర్జిటిక్ యాంకర్ ప్రదీప్ మాచిరాజు వ్యాఖ్యాతగా వ్యవహరించనున్నారు.

జీ తెలుగు సూపర్ క్వీన్ 2 రియాలిటీ షో మాత్రమే కాదు, మహిళా శక్తికి జరిగే పట్టాభిషేకం. వినోదభరితమైన టాస్కు, స్ఫూర్తివంతమైన ప్రదర్శనలతో షో ఆద్యంతం ఆసక్తికరంగా కొనసాగుతుంది. జీవితంలో ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొని విజయపథంలో నిలిచిన పదిమంది మహిళల ప్రయాణం మరెందరో మహిళలకు స్ఫూర్తిదాయకంగా నిలవనుంది. సూపర్ క్వీన్ 2 టైటిల్ కోసం జరిగే సమరాన్ని ఆరంభించేందుకు టాలీవుడ్ సూపర్ క్వీన్ కాజల్ అగర్వాల్ అతిథిగా రానున్నారు.ఈ సందర్భంగా కాజల్ అగర్వాల్ మాట్లాడుతూ, "ఈ ప్రపంచంలో ప్రతి మహిళ ఒక సూపర్ క్వీన్. 10 మంది మహిళలు అందం, తెలివితేటలతో పోటీపడే షో ప్రారంభోత్సవానికి రావడం చాలా ఆనందంగా ఉంది. సూపర్ క్వీన్ 2 ఒక ప్రత్యేకమైన వేదిక. మహిళలకు వారి నైపుణ్యాలు, సామర్థ్యాలను ప్రదర్శించడానికి ఇదో చక్కని అవకాశం అందిస్తుంది. ఈ షో చూసేవారిలోనూ స్ఫూర్తి నింపుతుంది. ఈ వేడుకలో భాగమవడం నేను గౌరవంగా భావిస్తున్నాను. పోటీదారుల మధ్య జరిగే పోటీని చూడటానికి ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను" అన్నారు.

పదిమంది మహిళామణుల మధ్య సాగే ఆసక్తికర సమరం ఏప్రిల్ 09 నుంచి, ప్ర తి ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు, మీ జీ తెలుగులో వస్తుంది.

# (మొదటి పేజీ తరువాయిలు)

### 'స్టాండప్ ఇండియా' పథకం ఎస్సీ, ఎస్టీ మహిళా వర్గాల్లో వ్యవస్థాపకతను ప్రోత్సహించే ఒక కీలక మైలురాయి : నిర్మలా సీతారామన్

వారికి నిధులు" ప్రాతిపదికగా స్టాండప్ ఇండియా పథకం రూపొందింది. ఎస్సీ, ఎస్టీ, మహిళా వ్యవస్థాపకులకు షెడ్యూల్డ వాణిజ్య బ్యాంకుల శాఖలనుంచి నిరంతర రుణపరపతికి ఇది హామీ ఇస్తుంది. వ్యవస్థాపకులు, వారి ఉద్యోగులు-కుటుంబాల జీవన ప్రమాణాల మెరుగుదలలో ఈ పథకం ఎంతో కీలకమైనది" అని పేర్కొన్నారు. అలాగే "ఈ పథకం కింద గడచిన ఏడేళ్లలో 1.8 లక్షలమందికిపైగా వ్యవస్థాపకులు లబ్ధిపొందారు" అంతేకాదు ఈ రుణాల్లో 80 శాతానికిపైగా మహిళలకు లభించడం నాకు ఎనలేని సంతృప్తిని కలిగించింది" అని డాక్టర్ కరద్ హర్షం వ్యక్తం చేశారు.

### పొత్తుల కోసం వెంపర్లాడుతున్న చంద్రబాబు : అమర్నాథ్

వాటిని పరిష్కరించే కార్యక్రమంలో భాగంగానే ఆసరా పథకాన్ని అమలు చేశారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డికి, అమర్నాథ్ కు ఈ ప్రాంత ప్రజలు అండగా ఉండాలని ఆయన కోరారు

కసింకోట ఎంపీపీ కలగా లక్ష్మీ గున్నయ్య నాయుడు మాట్లాడుతూ ప్రస్తుత సంక్షేమ ప్రభుత్వాన్ని తిరిగి అధికారంలో తీసుకువచ్చే బాధ్యత మనందరి మీద ఉందని అన్నారు.

ఈ కార్యక్రమానికి కలగా గున్నయ్య నాయుడు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో కసింకోట జడ్పిటిసి శ్రీధర్ రాజు, జిల్లా వైసీపీ అధికార ప్రతినిధి బుల్లిబాబు, గొలవెల్లి శ్రీనివాసరావు, మనసాల కిషోర్ ఎంపీపీలు నమ్మి మీనా గణేష్, పెంటకోట జ్యోతి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

### 175సీట్లలో వైసీపీని ఓడిస్తాం- వైజాగ్ జోనల్ సదస్సులో చంద్రబాబు

అందుకే దేవుడి ఆ స్క్రిప్ట్ తిరగరాశాడన్నారు. 23వ సంవత్సరం...23 వ తేదీ 23 ఓట్లతో మన ఎమ్మెల్సీ గెలిచారు. ఇదీ దేవుడి స్క్రిప్ట్ అని చంద్రబాబు పేర్కొన్నారు. మొన్నటి వరకు 80 మంది ఎమ్మెల్యే లను తీసేస్తాను అన్నాడని, ఇప్పుడు బాబ్బాబు అంటున్నాడని, జగన్ కు వెన్నెముకలో వణుకు పుట్టిందని చంద్రబాబు తెలిపారు.

ఎప్పుడు ఎన్నికలు వచ్చినా జగన్ గెలిచే అవకాశమే లేదని చంద్రబాబు తెలిపారు. ఈ ప్రభుత్వ ఎక్స్పైరీ టైం వచ్చిందన్నారు. మొన్నటి ఎమ్మెల్సీ ఎన్నికల్లో జగన్ మైండ్ బ్లాక్ అయ్యి...ఇప్పుడు ఎమ్మెల్యేలను గౌరవిస్తా అంటున్నాడన్నారు. ఈ నాలుగేళ్ల తెలుగు దేశం పార్టీ కోసం పోరాడిన కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. పట్టబద్రుల ఎన్నికల్లో తిరుగుబాటు.....వచ్చే ఎన్నికల్లో ప్రజా తిరుగుబాటు అవుతుందన్నారు. మేం 175 పోటీ చేస్తామా లేదా అనేది మీకు ఎందుకు చెప్పాలి. మేం 175లో వైసీపీని ఓడిస్తాం. పులివెందులలో కూడా జగన్ ను ఓడిస్తామన్నారు.

### ప్రణాళికాబద్ధంగా జిల్లా అభివృద్ధి

వెచ్చించినట్లు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న పరిమిత వనరులతో జిల్లా అభివృద్ధికి కృషిచేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నదని, ఖరీఫ్ సీజన్ లో జిల్లాలో గల 306 రైతు భరోసా కేంద్రాల ద్వారా 25,043 క్వింటాళ్ళ విత్తనాలు సరఫరా కాగా, అందులో 18966 మంది గిరిజనులకు 3101 క్వింటాళ్ళ విత్తనాలు సరఫరా చేయడమైనది. వై.ఎస్.ఆర్., రైతు భరోసా, పి.ఎం. జీపాన్ పథకం క్రింద 1.34 లక్షల రైతు కుటుంబాలకు రూ. 185 కోట్లు చెల్లించడమైనదని తెలిపారు. జిల్లా కలెక్టరు నిశాంత్ కుమార్ మట్లాడుతూ ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు అందించిన ప్రోత్సాహంతో కలెక్టరు కార్యాలయం నకు కావలసిన వసతులు సమకూర్చినట్లు తెలిపారు. జిల్లా అభివృద్ధికి అందరూ కలిసి కృషిచేస్తున్నారని, హౌసింగు నిర్మాణంలోరాష్ట్రంలోనే రెండవ స్థానంలో నిలించిందని తెలిపారు. జిల్లా కలెక్టరు కార్యాలయానికి మెయిన్ రోడ్డును అనుకొని మెయిన్ ద్వారం ఏర్పాటు చేయబడిందని, మెయిన్ రోడ్ జాతీయరహదారిగా మారుతున్న నేపద్యంలో జాతీయరహదారిని అనుకొని కలెక్టరు కార్యాలయం ఉంటుందని తెలిపారు. జిల్లాలో గల గిరిజన గ్రామాలలో పేద గిరిజనులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరువ చేయాలనే ఉద్దేశంతో 4%+% కనెక్టివిటీని కల్పన నిమిత్తం 180 టవర్ల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. జూన్ నాటికి 160 టవర్ల నిర్మాణాం పూర్తిచేయనునట్లు, జూన్ తరువాత జిల్లాలో పూర్తిస్థాయిలో నెట్ వర్క్ కనెక్టవిటీ అందుబాటులోనికి వస్తుందన్నారు. జిల్లాలో మౌళిక సదుపాయాలు కల్పించే దిశగా, జాతీయ రహదారి 130 పిడి పనులు 550 కోట్ల రూపాయిల వ్యయముతో జరుగుచున్నవని, అంతే కాక, 3వ రైల్వే లైన్ పనులు జిల్లాలో 44 కిలోమీటర్ల మేర రూ.460 కోట్ల రూపాయిల వ్యయముతో జరుగుచున్నవని తెలిపారు. పార్వతీపురం స్టేషనులో 14 ఎక్స్ ప్రెస్ ట్రెయిన్లు ఆపే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. దీనివలన ప్రజలకు, వ్యాపారులకు సౌకర్యంగా ఉండి, అభివృద్ధికి అవకాశం ఏర్పడుతుందని తెలిపారు. 2115.00 లక్షలరూపాయలు వ్యయముతో పార్వతీపురం జిల్లా ఆసుపత్రి 100 నుండి 150 పడకల ఆసుపత్రిగా అప్ గ్రేడ్ చేయడమైనదని, సంబంధిత పనులు పురోగతిలో ఉన్నాయని, 4926.00 లక్షల రూపాయలు వ్యయముతో పార్వతీపురం జిల్లాలో మల్టీ స్పెసాలిటీ ఆసుపత్రి మంజూరు కాబడినదన్నారు. ఫ్యామిలీ డాక్టరు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మన బడి నాడు నేడు పథకం క్రింద 540 పాఠశాలల్లో విభిన్న 814 ప్రాజెక్టులతో రూ.144 78 కోట్ల వ్యయముతో పాఠశాల ఆధునికీకరణ పనులు పూర్తి చేయడమైనదని అన్నారు. "పేదలు అందరికి ఇల్లు" కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 24,743 గృహాలు మంజూరు చేయగా ఇప్పటి వరకు: 7,952 గృహాల నిర్మాణం పూర్తి అయినవని, మిగిలినవి వివిధ దశలలో ఉన్నాయని తెలియజేసారు.ఈ కార్యక్రమంలో సంయుక్త కలెక్టరు ఒ.ఆనంద్, ఐ.టి.టి.ఎ. ప్రాజెక్టు అధికారి సి.విష్ణుచరణ్, జిల్లారెవిన్యూ అధికారి జె. వెంకటరావు,రెవిన్యూ డివిజిల్ అదికారి కె.హేమలత, శాసనసభ్యులు అలజంగి జోగారావు, పాముల పుష్పశ్రీవాణి, మున్సిపల్ చైర్మన్ బోను గౌరీశ్వరి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

### అంటరాని వారికి సమానత్వం కోసం "అల్ ఇండియా డిప్రెస్డ్ క్లాసెస్ లీగ్" స్థాపించిన బాబూ జగ్జీవన్ రామ్

బాధ్యతలు చేపట్టి భారతదేశపు మొట్టమొదటి క్యాబినెట్ కార్మిక మంత్రి, భారత రాజ్యాంగ పరిషత్ సభ్యునిగా నియమితులై సేవలందించారన్నారు. ఆయన భారత జాతీయ కాంగ్రెస్ సభ్యుడిగా నలభై సంవత్సరాలకు పైగా వివిధ శాఖల క్యాబినెట్ మంత్రిగా పనిచేశారు. ముఖ్యంగా 1971 ఇండో-పాక్ యుద్ధం జరిగిన సమయంలో భారత రక్షణ మంత్రిగా కూడా ఈ దేశానికి సేవలు అందించారని దాని ఫలితంగా బంగ్లాదేశ్ ఏర్పాటుకు స్ఫూర్తి ప్రదాతులయ్యారన్నారు. భారతదేశంలో హరిత విప్లవం, భారత వ్యవసాయాన్ని ఆధునీకరించడంలో వారు అందించిన సేవలు సహకారం ఎనలేనిదని కొనియాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆయనను స్ఫూర్తిగా తీసుకొని పరిపాలన అందించడం అందులో మేమందరం భాగస్వాములవ్వడం మాకు ఎంతో ఆనందాన్ని ఇస్తుందని పేర్కొన్నారు.

అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, సామాజిక సేవ, పేదవారి అభ్యుదయానికి ఎనలేని కృషి చేసిన మహోన్నత వ్యక్తి బాబూ జగ్జీవన్ రామ్ అని వారిని ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరూ ఆయన అడుగుజాడల్లో నడుస్తూ పేద ప్రజలకు సేవలందించాలని తెలిపారు. 116వ జయంతి సందర్భంగా ఇటువంటి మహోన్నత వ్యక్తిని ప్రజల గుండెల్లో స్థిరస్థాయిగా ఉంటారన్నారు.

# వి-శాఖ సమాచారమ్

గురువారం 06-04-2023


## ఒక తండ్రి తన పిల్లలకు రాసిన ఒక లేఖ..

ఈ లేఖలో కొడుకు జీవితం వుంది చదవండి ఆచరించండి

నేను ఈ లేఖ రాయడానికి మూడు కారణాలున్నాయి

1. జీవితం, అదృష్టం, దురదృష్టం అనేవి చాలా చంచలమైనవి. ఎవరూ వీటిని ఖచ్చితంగా అంచనా వేయలేరు.

2. నీ తండ్రిగా నేను నీకు ఇవి చెప్పకపోతే, ఇంకెవ్వరూ నీకు చెప్పరు.

3. నేను రాస్తున్నదంతా నేను జీవితంలో అనుభవించినవి. నీకు ఇవి తెలిస్తే బహుశా జీవితంలో చాలా సమయాలలో నీ గుండె గాయపడకుండా ఉంటుందని.

ఈ క్రింద విషయాలు జాగ్రత్తగా గుర్తుంచుకో.

1. నీతో సఖ్యంగా లేని వారి పట్ల ద్వేషం పెంచుకోకు. నేను, మీ అమ్మ తప్ప నీకు తప్పనిసరిగా మంచే చేయాలన్న బాధ్యత ఎవరికీ లేదని బాగా గుర్తెరిగి మసలుకో.

నీతో మంచిగా ఉన్నవారిపట్ల కృతజ్ఞుడివై వుండు. అలాగే జాగ్రత్తగా గమనించు కూడా. ఎందుకంటే ప్రతి ఒక్కరి ప్రతి పనికీ ఒక ఉద్దేశం ఉంటుంది. నీతో ఎవరైనా స్నేహంగా ఉంటే ఎప్పటికీ అలానే ఉండాలని లేదు, జాగ్రత్త, గుడ్డిగా వారిని ఆత్మీయులుగా నమ్మి మనసు గాయపరచుకునేవు సుమా!

2. ఏ ఒకరూ తప్పనిసరి కాదు, తప్పక కలిగి ఉండితీరవలసినది ఏదీ లేదని మరచిపోకు.

ఇది నీవు సరిగా అర్థం చేసుకున్న రోజు నీ చుట్టూ ఉన్నవారు నిన్ను వద్దనుకున్నా, నువ్వు బాగా కోరుకున్నది నీకు దూరమైనా నీ మనసు పెద్దగా గాయపడదు.

3. జీవితం చిన్నది.

ఒక రోజు వ్యర్థమైనా చక్కగా అనుభవించాల్సిన, మళ్ళీ తిరిగిరాని ఒక రోజుని కోల్పోయావన్న విషయం గుర్తించు.

4. ప్రేమ అనేది ఒక నిలకడలేని, చంచలమైన ఒక భావన. కాలాన్ని, మూడ్ ని బట్టి వెలసిపోయే ఒక ఎమోషన్. నువ్వు బాగా ప్రేమించాననుకున్నవారు దూరమైనపుడు కుంగిపోకు, ఓపిక పట్టు. కాలం నీ గాయాలను, బాధలను అన్నింటినీ కడిగేస్తుంది, కావాలంటే నీ చుట్టూ ఉన్నవారి జీవితాల్ని గమనించు.

ప్రేమ సౌందర్యాన్ని , అలాగే ప్రేమ విఫలమవడాన్ని అతిగా ఊహించుకోకు. ఏమంత పెద్ద విషయాలు కావని కాలం గడిచే కొద్దీ తెలుసుకుంటావని తెలుసుకో

5. చాలామంది పెద్దగా చదువుకోకుండానే జీవితంలో బాగా పెద్ద స్థాయికి వెళ్లుండచ్చు, కానీ దానర్థం నువ్వు కష్టపడి చదవకుండానే గొప్పవాడయిపోతావని కాదు. నువ్వు సంపాదించే జ్ఞానమంతా నీ ఆయుధాలని గ్రహించు.

దీవాళా తీసిన స్థితి నుండి తిరిగి ఉన్నతమైన స్థానం చేరడం సాధ్యమే, కానీ దీవాళా తీసినప్పటి పరిస్థితి దారుణంగా ఉంటుందని మరచిపోకు.

6. నేను వృద్ధాప్యంలో ఆర్థికంగా నీమీద ఆధారపడను, అలాగే జీవితాంతం ఆర్థికంగా నీకు ఆసరా ఇవ్వలేను. నువ్వు పెద్దవాడవుతూనే నా బాధ్యత తీరిపోతుంది. తర్వాత బస్సులో తిరుగుతావా నీ సొంత లగ్జరీ కారులోనా? రిచ్ గానా మామూలు జీవితమా? అన్నది నీవే నిర్ణయించుకో.

7. నువ్వు నీ మాట నిలబెట్టుకో, ఇతరులనుంచి ఇది ఆశించకు. నువ్వు అందరితో మంచిగా ఉండు, అందరూ నీతో మంచిగా ఉంటారని అనుకోకు. ఇది నువ్వు సరిగా అర్థం చేసుకోకపోతే నీకు అనవసర సమస్యలు తప్పవు.

8. లెక్కలేనన్ని లాటరీ టికెట్లు చాలా కాలం కొన్నా, ఒక చెప్పుకోదగ్గ పెద్ద ప్రైజ్ ఎప్పుడూ రాలేదు. కష్టపడితేనే ధనవంతులవుతాము అన్నదానికి ఉదాహరణమిదే. విజయానికి షార్ట్ కట్ లేదని బలంగా నమ్ము.

9. అది ఎంతకాలమైనా సరే, మనం కలసివున్న కాలాన్ని జాగ్రత్తగా దాచుకుందాం. వచ్చే జన్మలో మళ్ళీ కలుస్తామో లేదో మనకు తెలియదు కదా కన్నా!

నాన్న...

## దళితుల కోసం ఎన్నో సంక్షేమ ఫలాలను అందించిన మహనీయుడు డా. జగ్జీవన్ రామ్



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** భావితరాల దళితుల కోసం ఎన్నో సంక్షేమ ఫలాలను అంధించేందుకు కృషి చేసిన మహనీయుడు డా. బాబు జగ్జీవన్ రామ్ అని జిల్లా కలక్టరు డా ఎ.మల్లిఖార్జున తెలిపారు. డా. బాబు జగ్జీవన్ రామ్ 116వ జయంతి సందర్భంగా బుధవారం ఉదయం బీచ్ రోడ్డు లో విశాఖ మ్యూజియం వద్ద గల డా. బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి జిల్లా కలెక్టర్ డా.ఎ.మల్లిఖార్జన, జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాధన్, నగర మేయర్ గొలగాని హరివెంకట కుమారి, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ జె.సుబధ్ర, రెల్లి కార్పొరేషన్ చైర్మెన్ వి.మధుసూదనరావు, డిప్యూటీ మేయర్ కె.సతీష్ లతో కలసి పూలమాలాంకరణ చేసారు.

ఈ సందర్భంగా కలక్టరు మాట్లాడుతూ దళిత వర్గాల ఆశాజ్యోతి, సమతావాధి, అయిన డా. బాబు జగ్జీవన్ రామ్ దేశ ఉప ప్రధాని వరకు ఎన్నో పధవులు అలంకరించి దేశానికి ఎన్నో గణవిజయాలు సాదించిన మహొన్నత వ్యక్తి అన్నారు. బీహరు రాష్ట్రంలో షాబాద్ జిల్లాలో చాందాగ్రామంలో జన్మించి దేశ పరిపాలన విధాన నిర్ణాయాలలో కీలకపాత్ర వహించారన్నారు. దళిత జాతుల పట్ల జరిగే అన్యాయలకు వ్యతిరేకంగా పోరటం చేసిన మహొన్నత వ్యక్తి అన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి డి.శ్రీనివాసమూర్తి, సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ రమణమూర్తి, ఆర్డిఒ హ్సేసేన్ సాహేబ్, బిసి సంక్షేమ శాఖ ఇడి శ్రీదేవి, జివియంసి, సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఐక్య ఉద్యమాలతో ప్రతి ఘటించండి

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** విశాఖ స్టీల్ ప్లాంట్ ను అస్థిరపరిచే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అను సరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలతో ప్రతిఘటించండని స్టీల్ సిఐటియు గౌరవా ధ్యక్షులు జె అయోధ్యరామ్ పిలుపు నిచ్చారు నేడు న్యూఢిల్లీలో "మజ్దూర్ కిసాన్ సంఘర్ష మార్చ్" సంఘీభావం గా స్టీల్ సిఐటియు ఆధ్వర్యంలో స్టీల్ ప్లాంట్ టిటిఐ కూడలి వద్ద ధర్నా నిర్వహించారు ఈ ధర్నాలో ప్రభుత్వ యాజమాన్యాలకు వ్యతిరేకంగా కార్మికులు పెద్ద ఎత్తున నినదించారు.

ఈ ధర్నాను ఉద్దేశించి జె అయోధ్య రామ్ మాట్లాడుతూ ప్రభుత్వ అధీనంలో ఉన్న ముడి సరుకులను ప్రభుత్వం అందించకుండా ఉద్దేశ పూర్వకంగానే విశాఖ స్టీల్ ప్లాంట్ ను నష్టాల్లోకి నెడుతోందని ఆయన తీవ్రంగా విమర్శించారు ప్రభుత్వం సహకరిస్తే ప్లాంట్ ను పూర్తి సామర్థ్యంతో నడిపి సాలిన 50 వేల కోట్ల టర్నోవర్ ను సాధించి 9వేల కోట్లను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు అందించడానికి సిద్ధంగా ఉన్నామని ఆయన స్పష్టం చేశారు ఈ దిశగా కాకుండా ప్రభుత్వ యాజమాన్యాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఐక్య ఉద్య మాలతో ప్రతిఘటననికి సిద్ధంగా ఉన్నామని ఆయన హెచ్చరించారు

ధర్నాకు అధ్యక్షత వహించిన స్టీల్ సిఐటియు అధ్యక్షులు వైటి దాస్ మాట్లాడుతూ కార్మికుల మనో ధైర్యాన్ని ఆత్మస్థైర్యాన్ని నిర్వీర్యం చేసి ఉత్పత్తి ఉత్పాదకతల లక్ష్యాలను చేరకుండా నూతన వేత నాలును అమలు చేయకుండా వారిని మనోవేదనకు గురి చేస్తున్నా రని ఆయన తీవ్రంగా విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వ యాజమాన్యా లు తమ వైఖరిని మార్చుకొని కార్మి కులకు నూతన వేతనాలు అమలు చేయకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదని ఆయన హెచ్చరించారు నగర సిఐటియు అధ్యక్షులు కె ఎం శ్రీనివాస్, ఉపాధ్యక్షులు ఎస్ రామారావు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా కార్మిక కర్షక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ నేడు శ్రమజీవులు అందరూ రాజధానిలో కదం తొక్కుతున్నారని వారన్నారు. దేశ ప్రయోజనాలను పణంగా పెట్టి పాలకులు ప్రజలను ప్రజా సంపదను కార్పొరేట్లకు అందిస్తున్నారని వారు తీవ్రంగా విమర్శించారు స్వాతంత్రా నంతరం ప్రజలలో మనోధైర్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని కొంతవరకైనా నింపేందుకు గత పాలకులు కృషి చేస్తే నేటి పాలకులు వాటిపై ఉక్కుపాదంతో తొక్కి వారి మను గడనే ప్రశ్నార్థకంగా మారుస్తున్నారని వారు వివరించారు వీటిని ప్రశ్నించిన వారిపై కేంద్ర ప్రభుత్వం తన అధికార మదంతోను, ఆర్ఎస్ఎస్ గూండాలు భౌతిక దాడులతో ప్రజల ధన మన ప్రాణాలను హరిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు వీటిని వివరిస్తూ ప్రజా చైతన్యంలో భాగం గానే నేడు జరుగుతున్న ర్యాలీ అని ఇప్పటికైనా ప్రభుత్వంలో మార్పు రానిపక్షంలో ఐక్య ఉద్యమాలను మరింత ఉధృతం చేసి ప్రతిఘటి స్తామని వారు హెచ్చరించారు ఈ కార్యక్రమంలో స్టీల్ సిఐటియు నాయకులు డి కృష్ణమూర్తి,యు వెంకటేశ్వర్లు,నీలకంఠం,భానుమూర్తి గడా వెంకటేశ్వరరావు,చిరంజీవి తదితరులతో పాటు వివిధ విభాగాల అధ్యక్ష కార్యదర్శులు అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

## విలువలతో కూడిన విద్యావంతులుగా యువత ఎదగాలి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** విలువలతో కూడిన విద్యావంతులుగా దేశ యువత ఎదగాలని బాబు జగ్జీవన్ రామ్ ఆకాంక్షించారని ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత అన్నారు. బుధవారం ఏయూలోని బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ముందుగా ఏయూలోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి అంజలి ఘటంచారు. భారత దేశ అమూల్య రత్నంగా జగ్జీవన్‌రామ్‌ను పిలుస్తున్నారన్నారు. ఆత్మాభిమానంతో జీవించాలని జగ్జీవన్‌రామ్ కోరుకునే వారన్నారు. ప్రజాసేవ చేయడం, విలువల పరిరక్షణకు ఆయన కృషిచేసారన్నారు. చిన్నవయసులో ఆయన మంత్రిపదవిని చేపట్టి 52 సంవత్సరాలు రాజకీయ పదవుల్లో ప్రజలకు విశిష్ట సేవలు అందించారన్నారు.

ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ తన ఆలోచన విధానంతో ఒక బలమైన ముద్రను వేసుకుని ఎదిగిన విధానం ఆదర్శమన్నారు. దేశంకోసం ఎనలేని సేవలు అందించారన్నారు. కార్మిక నాయకుడిగా తన ప్రస్థానాన్ని ప్రారంభించి, రైల్వేమంత్రిగా చేసిన సేవలు ఎంతో శ్లాఘనీయమన్నారు.

ఆచార్య టి.వి కృష్ణ మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం ఏయూలో జగ్జీవన్‌రామ్ జయంతిని అధికారులు ఘనంగా నిర్వహించడం జరుగుతోందన్నారు. బాబు జగ్జీవన్‌రామ్ చైర్ త్వరలో విధులను ప్రారంభిస్తుందన్నారు.

డాక్టర్ టి.షారోన్ రాజు మాట్లాడుతూ బాబు జగ్జీవన్‌రామ్‌కు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంతో, ప్రత్యేకంగా ఆంధ్రవిశ్వవిద్యాలయంతో ఉన్న అనుబంధాన్ని వివరించారు.

ఈ సందర్భంగా ఆచార్య టి.వి.కృష్ణ రచించిన సోషియో పొలిటికల్ ఐడియాలజీ అండ్ లీడర్‌షిప్ ఆఫ్ బాబు జగ్జీవన్‌రామ్ పుస్తకాన్ని రెక్టార్ ఆచార్య సమత ఆవిష్కరించారు. అనంతరం లిమ్కాబుక్ ఆఫ్ రికార్డ్‌లో స్థానం సాధించిన ఏయూ ఉద్యోగి చెన్నా అప్పలరాజును సత్కరించారు.

కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ ఆచార్య ఏ.నరసింహా రావు, కె.శ్రీనివాస రావు, వి.విజయలక్ష్మి, టి.శోభశ్రీ, ఆచార్య జి.శశిభూషణ రావు, కె.విశ్వేస్వర రావు, ఏ.కె.ఎం పవార్, పి.అర్జున్ కె.వెంకటేశ్వర రావు, ఎస్.ఏ.డి పాల్, ఎస్.సత్యనారాయణ, జి.సుధాకర్, పి.ప్రేమానందం, మున్నంగి నాగరాజు, అప్పలనాయుడు, ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు, ఉద్యోగులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## 15వ వార్డులో ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ 116వ జయంతి వేడుకలు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఈరోజు 15వ వార్డు సింహాద్రిపురంలో దళిత జనాభ్యుదయ సేవా సంఘం ఆధ్వర్యంలో స్వతంత్ర సమరయోధులు సంఘసంస్కర్త రాజకీయవేత్త భారత మాజీ రక్షణ శాఖ మంత్రివర్యులు భారతదేశ మాజీ ఉప ప్రధాని మాదిగ జాతి ముద్దుబిడ్డ కీర్తిశేషులు డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 116వ జయంతి వేడుకలు పురస్కరించుకొని, ఈ కార్యక్రమం ముఖ్య అతిథి అయిన మాజీ కార్పొరేటర్ దళిత నాయకులు కొప్పుల వెంకట్రావు గారు తన సందేశాన్ని అందించి అనంతరం కేక్ కటింగ్ చేసి వృద్ధులకు మహిళలకు స్వీట్స్ డ్రింక్స్ పంచడం జరిగింది ఈ కార్యక్రమంలో స్థానిక దళిత జనాభ్యుదయ సేవా సంఘం నాయకులు మరియు యువకులు మహిళలు పాల్గొని ఈ యొక్క కార్యక్రమం విజయవంతం చేయడం జరిగింది.

## కేంద్రీయ విద్యాలయాలలో ప్రవేశాలకు దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** సీబీఎస్ఈ కరిక్యులమ్ తో ఒత్తిడి లేని నాణ్యమైన విద్యను నామమాత్రపు తక్కువ ఫీజుతో పొందవచ్చు.

ఒకటో తరగతిలో ప్రవేశం పొందితే, ప్లస్ 2 వరకు నిశ్చింతగా చదువుకోవచ్చు.

సువిశాల ప్రాంగణాలు, సుశిక్షితులైన బోధన సిబ్బంది, ఆటస్థలం, అన్ని సౌకర్యాలు... కేవీల ప్రత్యేకత.

ఒకటో తరగతిలో ప్రవేశానికి ఆన్లైన్ దరఖాస్తులు: ఏప్రిల్ 17 సాయంత్రం 7 వరకు స్వీకరిస్తారు.

రెండు, ఆపైన తరగతుల్లో ఖాళీ సీట్లలో ప్రవేశానికి: ఏప్రిల్ 3 నుంచి 12 వరకు సంబంధిత విద్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చు.

**నోటిఫికేషన్, ఆన్లైన్ అప్లై లింక్, పూర్తి వివరాలు**
http://bit.ly/kvs-admission-notification-2023-24

## ఘనంగా బాబూ జగజ్జీవన్ రామ్ జయంతి వేడుకలు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** స్థానిక గవరపాలెం అరుంధతి నగర్ లో బుధవారం సంఘ సంస్కర్త, అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి కృషి చేసిన స్వాతంత్ర సమరయోధులు, భారత ఉప ప్రధానమంత్రి గౌరవనీయులు శ్రీ బాబు జగ్జీవన్ రామ్ 116వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అనకాపల్లి పట్టణ శాఖ అధ్యక్షులు మందపాటి జానకిరామరాజు, పార్టీ నాయకులు ఆళ్ల నాగేశ్వరరావు, గైపూరి రాజు, మునూరు శ్రీనివాసరావు, కోన ఉమా, పేలూరు కళ్యాణ్ తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

## సామాజిక పెన్షన్లలో కోత విధించడం అన్యాయం

**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం సామాజిక పెన్షన్లలో పెద్ద ఎత్తున కోత విధించి తెలుగుదేశం ప్రభుత్వంలో మంజూరైన ఆరు లక్షల మంది పెన్షన్లను తొలగించి పేదలకు తీరని అన్యాయం చేశారని తెలుగుదేశం పార్టీ అనకాపల్లి పార్లమెంట్ మీడియా కోఆర్డినేటర్ కొణతాల వెంకటరావు వైసీపీ ప్రభుత్వం పై విమర్శలు చేశారు. మంత్రి అమర్నాథ్ అర్హులైన వారందరికీ పెన్షన్ మంజూరు చేస్తున్నామని గొప్పలు చెప్పడం తప్ప నిజమైన పేదవారిని గుర్తించడం లేదని, వారందరికీ ఎటువంటి ఆధారం లేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని, అనర్హులను గుర్తించి తొలగించడంలో తప్పు లేదని, కానీ అర్హత ఉన్నవారు పెన్షన్లను కూడా తొలగిస్తున్నారని, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళ, వికలాంగులు, కళాకారులు, హిజ్రాలు, మొదలైన వారిని కరెంట్ బిల్లు 300 యూనిట్లు వచ్చిందనో, రేషన్ కార్డులు ఎవరో ఒకరికి ఆదాయం ఎక్కువ ఉందనో, అనేక నిబంధనలను విధించి వృద్ధులను లబ్ధిదారుల జాబితా నుండి తొలగిస్తున్నారని వెంకటరావు ఆవేదన వ్యక్తపరిచారు. ఈ నిబంధనలు అందరికీ వర్తిస్తున్నాయా అంటే అదీ లేదని వైసీపీ మద్దతుదారులకు వైసీపీ నాయకులు సిఫార్సుతో అధిక ఆదాయం ఉన్న, కరెంట్ బిల్లు 300 యూనిట్లు దాటిన పది ఎకరాల పొలం ఉన్న పెన్షన్ మంజూరు చేస్తున్నారని, కానీ వారి పెన్షన్లు రద్దు చేస్తున్నారని వెంకటరావు మండిపడ్డారు. తెలుగుదేశం ప్రభుత్వం దిగిపోయినటికీ కేవలం 39 లక్షలకు మాత్రమే ఇస్తున్నారని ఎన్నికలకు రెండు నెలల ముందు 1000 మాత్రమే ఇచ్చారని వైసిపి ప్రభుత్వం పత్రికా ప్రకటనలో అబద్ధపు ప్రచారం చేస్తున్నారని, కానీ నిజానికి 2018 ఏప్రిల్ నుండి అక్టోబర్ వరకు 42,66,729 మందికి పంపిణీ చేశారని అదే ఏడాది నవంబరు నుండి 2019 మార్చి వరకు 54,66,732 పెన్షన్లు పంపిణీ చేశారని



అసెంబ్లీ సాక్షిగా జగన్ రెడ్డి ప్రభుత్వం వెల్లడించిందని, తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో పెన్షన్ల లబ్ధిదారుల సంఖ్య కూడా తప్పుడుగా లెక్కలు చెప్పామని అసెంబ్లీ సాక్షిగా గ్రామీణాభివృద్ధి శాఖ అంగీకరించిందని వెంకటరావు అన్నారు. సంక్షేమానికి మా ప్రభుత్వం ప్రాధాన్యత ఉంటూ ఏ ఏ పథకాలకు ఎంత ఖర్చు పెడుతున్నదీ కోట్లు ఖర్చుపెట్టి మరీ ప్రకటనలు ఇస్తున్నారని, కానీ పథకాల అమల్లో సమాచారం అంతా దాచి పెడుతున్నారని, ముఖ్యమంత్రి జగన్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ లో పెన్షన్లపై పదే పదే అబద్ధాలు చెబుతున్నారని ప్రభుత్వం పారదర్శకంగా అమలు చేస్తే సమాచారాన్ని గోప్యంగా ఉంచవలసిన అవసరం ఏమిటని వెంకటరావు ప్రశ్నించారు. గత తెలుగుదేశం ప్రభుత్వం పెన్షన్లు ఇస్తున్నవి పోలుస్తూ పత్రికల్లో కథనాలు రావడంతో ప్రభుత్వ వెబ్ సైట్ లో పూర్తి సమాచారం లేకుండా తొలగించారని వెంకటరావు ఘాటుగా విమర్శలు చేశారు. తెలుగుదేశం ప్రభుత్వం ఇచ్చిన పెన్షన్లను తక్కువగా చూపిస్తూ వైసిపి ప్రభుత్వం ఎక్కువ పెన్షన్లు ఇచ్చినట్లు అబద్ధాలు ప్రచారం చేస్తూ రాజకీయ లబ్ది పొందే ప్రయత్నాలు చేస్తున్నారని ప్రజలను ఎల్లకాలం మోసం చేయలేరని వాస్తవాలు తెలుసు కుంటున్నారని వచ్చే ఎన్నికల్లో ఈ ప్రభుత్వానికి బుద్ధి చెప్పే సమయం ఆసన్నమైందని వెంకటరావు అన్నారు.

# రాష్ట్రంలో మహిళా సాధికారతే లక్ష్యం



**పార్వతీపురం, (విశాఖ సమాచారమ్):** రాష్ట్ర మహిళా సాధికారతే లక్ష్యం చేసుకుని పాలనను సాగిస్తున్న ఏకైక సీఎం వైయస్ జగన్మోహన్ రెడ్డి పార్వతీపురం పురపాలక సంఘంలో 3వ విడత వైయస్అర్ ఆసరా కార్యక్రమంలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు.పార్వతీపురం పురపాలక సంఘం పరిధిలో 3వ విడత కార్యక్రమం ద్వారా 826 స్వయం సహాయక సంఘాలులో గల 8,288 మంది మహిళా సభ్యులకు 5.94 కోట్ల రూపాయలు విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం - ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆసరా కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న నియోజకవర్గ పార్టీ పరిశీలకులు మాజీ ఎమ్మెల్యే శ్రీమతి శోభా హైమావతి పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో గల పార్వతీపురం పురపాలక సంఘంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో బుధవారం నాడు వైఎస్అర్ ఆసరా 3వ విడత కార్యక్రమం ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యంలో వేలాది మంది మహిళల సమక్షంలో ఘనంగా నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో మరో ముఖ్య అతిధులుగా పార్టీ పరిశీలకలు శోభా హైమావతి పాల్గొన్నారు. కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే కి మండల ప్రజా ప్రతినిధులు నాయకులు మహిళా సభ్యులు ఘనంగా స్వాగతం పలకడం జరిగినది. అనంతరం సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ప్రజా ప్రతినిధులు మరియు మహిళా సభ్యులు కార్యక్రమంను ఉద్దేశించి మాటలాడటం జరిగినది. ఈ కార్యక్రమంలో శోభా హైమావతి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి మహిళా సాధికారతకు, మహిళల స్వయం ఉపాధికి అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని అందులో భాగంగానే ఈ పథకం ద్వారా మహిళలకు ఆర్థికంగా అండగా నిలిచి వారి కాళ్లపై వాళ్లు నిలబడేలా చేసి కుటుంబ ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచే ఉద్దేశంతో ఈ పథకాన్ని అమలు చేయడం జరుగుతుందని కావున మన మహిళలు అంతా కూడా ఈ అవకాశాన్ని చక్కగా సద్వినియోగం చేసుకొని తమ కాళ్లపై తాము నిలుచొని కుటుంబాలను మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి గారికి మళ్ళీ వచ్చే ఎన్నికల్లో విజయాన్ని అందించి అలానే సోదరుడు స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావును కూడా దీవించాలని కోరుకున్నారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళా సాధికారత కొరకు ప్రభుత్వం చేపడుతున్న అనేక పథకాలలో ఒకటి ఈ వైయస్అర్ ఆసరా పథకం ద్వారా 85 లక్షల మహిళలకు 25 వేళ కోట్లకు పైగా రుణాలను మాఫీ చేయడం జరుగుతుంది అని అందులో భాగంగానే నేడు 3వ విడత ద్వారా రుణ మాఫీ సహాయం నేరుగా మీ ఖాతాల్లో జమ చేయడం జరిగినది అని తెలిపారు. ప్రభుత్వం చేపట్టే అన్ని కార్యక్రమాలను పూర్తి స్థాయిలో వినియోగించుకొని మన కుటుంబ ఆదాయాలును పెంచుకొని, మనం సంతోషంగా ఉండాలని, మన రాష్ట్ర తలసరి ఆదాయం పెరిగి తద్వారా రాష్ట్ర అభివృద్ధిలో మనం భాగస్వాములం కాగలుగు తామనే విశయం మన సీఎం జగనన్న తెలియజేశారన్నారు. ప్రభుత్వం పుట్టిన బిడ్డ నుండి అలసి సొలసి ఇక కాయ కష్టం చేయలేని ముసలి వాళ్ళ వరకూ ప్రతి ఒక్కరి అవసరాలను గుర్తించి తగు పథకాలను అమలు చేయడంతో పాటు, మహిళాభివృద్ధి ద్వారానే కుటుంబాభివృద్ధి జరుగుతుందని గట్టిగా నమ్మిన వ్యక్తిగా, మహిళల కోసం తల్లులకు అమ్మఒడి పథకము, గోరుముద్ద, విద్యా దీవెన, వసతి దీవెన, విద్యాకానుక, పేదింటి ఆడపిల్లలకు అండగా ప్రభుత్వ బడుల రూపు రేఖలను మార్చే మనబడి నాడు-నేడు, ఇంగ్లీష్ మీడియం, ఇళ్ళ పట్టాలు అక్కచెల్లెమ్మల పేరుతో, అన్ని నామినేషన్ పోస్టులల్లో 50 శాతం మహిళలకు కేటాయించడం, వృద్ధాప్య వితంతు పింఛన్లు అలానే మహిళల రక్షణ కొరకు దిశ చట్టం మరియు దిశ పోలీస్ స్టేషన్ల వంటి ఎన్నో కార్యక్రమాలను అమలు చేస్తున్నారు మన సీఎం వైయస్ జగనన్న అని తెలిపారు.మహిళా పక్షపాత ప్రభుత్వంగా, అక్కచెల్లెమ్మల జీవితాల్లో ఆర్థిక, సామాజిక, రాజకీయ చైతన్యానికి అన్ని విధాలుగా కృషి చేస్తున్నారు మన ముఖ్యమంత్రి శ్రీ వైయస్ జగన్ మోహన్ రెడ్డి గారు అని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గారితో పాటు మున్సిపల్ చైర్ పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్ చైర్మన్లు కొండపల్లి రుక్మిణి, ఇండుపూరు గున్నేశ్వరరావు, పార్టీ పట్టణ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, పార్టీ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, జెసిఎస్ కన్వీనర్ గొర్లి మాధవరావు, మున్సిపల్ కమిషనర్ రామప్పల నాయుడు, ఏఎంసీ వైస్ చైర్మన్ వి శంకర్రావు, వైసీపీ సీనియర్ నాయకులు, కౌన్సిలర్ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు, ఏఎంసీ డైరెక్టర్లు, సచివాలయం కన్వీనర్లు, మెప్మా అర్పిలు, మహిళా సంఘం సభ్యులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# జగ్జీవన్ రామ్ 116వ జయంతి వేడుకలు నిర్వహించి నివాళులు అర్పించిన అలజంగి



**పార్వతీపురం, (విశాఖ సమాచారమ్):** బాబుజీగా ప్రసిద్ధి చెందిన జగ్జీవన్ రామ్ అంటరాని వారి శ్రేయస్సు కోసం తన జీవితాన్ని అంకితం చేసిన దళిత చిహ్నం అని గుర్తు చేశారు స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు. బుధవారం ఆయన 116వ జయంతిని పురస్కరించుకుని పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో గల ప్రధాన రహదారిపై గల ఆయన విగ్రహానికి ప్రజా ప్రతినిధులు, దళిత సంఘాల నాయకులు, ఉద్యోగులలో కలిసి ఘనంగా నివాళులు అర్పించి జోహార్లు అర్పించారు స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు . ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఒక సామాన్య రైతు కుటుంబంలో 1908 ఏప్రిల్ 5న బాబూ జగ్జీవన్ రామ్ పుట్టారు అని ఆయన తండ్రి శోబీరామ్, తల్లి వసంతిదేవి కాగా, బీహార్‌లోని షాహాబాద్ (ఇప్పుడు భోజ్‌పూర్) జిల్లాలోని చంద్వా అనే చిన్న గ్రామంలో ఆయన జన్మించారు అన్నారు.ఆయన వలసవాదం, సామ్రాజ్య వాదాలకు వ్యతిరేకంగా భారతదేశంలో జరిగిన స్వాతంత్ర్యోద్యమంకు నిర్మూలనకోసం జరిగిన సామాజిక సంస్కరణోద్యమాలు కన్న ముద్దుబిడ్డ డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్, భారతదేశ స్వరాజ్య ఉద్యమంతో, తదనంతరం జరిగిన దేశ పునర్నిర్మాణంతో ముడిపడిన జగ్జీవన్‌రామ్ జీవితం రాజకీయ, సామాజిక, చారిత్రిక ప్రాధాన్యత కలిగి ఉంది అన్నారు. జగ్జీవన్‌రామ్‌ని స్మరించుకోవడం అంటే భారతదేశ స్వాతంత్ర్యం, సామాజికోద్యమాల ప్రాంగణాన జరిగిన, ఉప్పొంగిన సమరోజ్వల సమున్నత ఘట్టాలను గుర్తు చేసుకోవడమే అని ఎమ్మెల్యే తెలిపారు.

అతను 1936-1986 మధ్య 50 సంవత్సరాల పాటు నిరంతరాయంగా పార్లమెంటు సభ్యుడిగా ప్రపంచ రికార్డు సాధించారు అని, అత్యంత గౌరవనీయమైన దళిత నాయకులలో ఒకరైన అతను 1971 భారత-పాకిస్తాన్ యుద్ధంలో భారత రక్షణ మంత్రిగా పనిచేశారు అని గుర్తు చేశారు.జగ్జీవన్‌రామ్ మహోన్నత నాయకత్వం, వ్యక్తిత్వం, సేవలు భారతదేశ ప్రజాస్వామిక వ్యవస్థకు, సంస్థలకు మహాబలాన్ని చేకూర్చిపెట్టాయి అని, భారత రిపబ్లిక్ తొలి లోక్‌సభ (1952)లో ప్రవేశించిన జగ్జీవన్‌రామ్ వరుసగా ఎనిమిదిసార్లు గెలిచారు, ముప్పైమూడు సంవత్సరాలు కేంద్రమంత్రిగా, దేశ ఉప ప్రధానిగా దేశంలో ప్రజారాజ్య నిర్మాణానికి నిరంతరం కృషి సాగించి మొదటి శ్రేణి పార్లమెంటేరియన్‌గా నిలిచారు అని గుర్తు చేస్తూ ఆయన సేవలను కొనియాడారు.ముప్పై మూడేళ్ళకు పైగా కేంద్ర కేబినెట్ మంత్రిగా, దేశ ఉప ప్రధాన మంత్రిగానూ డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ తీసుకున్న అసంఖ్యాక నిర్ణయాలు, ఆయన నాయకత్వాన చేసిన అనేక ముఖ్యమైన మౌలికమైన చట్టాలు దేశ సామాజిక పరివర్తనలో, అమలు జరిగిన సామాజిక న్యాయంలో ప్రస్ఫుటంగా ప్రతిఫలిస్తున్నాయి అన్నారు. దేశంలోని పేదవర్గాలు, శ్రామిక ప్రజలు, సగటు మనుషులు, వెనుకబడిన వర్గాలు, ముఖ్యంగా షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, వారి హక్కులు, అభివృద్ధికోసం జగ్జీవన్‌రామ్ తీవ్రంగా కృషి చేశారు అని నేటికీ ఆయన్నే స్ఫూర్తిదాయకంగా తీసుకుని ముందుకు సాగడం జరుగుతుంది అన్నారు.1969లో అధికార కాంగ్రెస్ పార్టీకి జగ్జీవన్‌రామ్ అధ్యక్షుడయ్యారు అని 1977లో ఇందిరాగాంధీ నియంతృత్వ విధానాలతో విభేదించి, కాంగ్రెస్ పార్టీపై తిరుగుబాటు ప్రకటించి బయటకు వచ్చిన జగ్జీవన్‌రామ్ 'ప్రజాస్వామ్య కాంగ్రెస్' (కాంగ్రెస్ ఫర్ డెమోక్రసీ) అనే పార్టీని స్థాపించారు అని, 1980 మార్చిలో 'కాంగ్రెస్ (జె)' పేరుతో పార్టీని స్థాపించారు అని తెలిపారు. ఈ దేశం, ఈ ప్రజలు బాబూజీ సేవలను ఎప్పటికీ గుర్తుంచు కోగలదు అని, సామాజిక, రాజకీయ బానిసత్వాలపై జీవితాంతం యుద్ధం చేసిన బాబూజీ ఎప్పటికీ, ఎల్లరకీ స్ఫూర్తిదాత, ఆదర్శనీయుడు అని ఎమ్మెల్యే అన్నారు. అణగారిన సమూహాల మహానాయకుడు, నిజమైన భారత 'రత్న' డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ అని ఆయన చూపిన భాటలో మన మంతా ముందుకు సాగాలని పిలుపు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ బోను గౌరీశ్వరి, మున్సిపల్ వైస్ చైర్మన్ ఇండుపూరు గున్నేశ్వరరావు, పార్టీ పట్టణ అధ్యక్షులు కొండపల్లి బాలక్రిష్ణ, పార్టీ ఫ్లోర్ లీడర్ గొర్లి మాధవరావు, వివిధ వార్డుల కౌన్సిలర్ సభ్యులు, గ్రామాల సర్పంచ్లు, వైసీపీ సీనియర్ నాయకులు, దళిత సంఘాల నాయకులు, జిల్లా మాదిగ సమైక్య సంఘం సభ్యులు, జేఏసీ సభ్యులు, స్థానిక ప్రజలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ జయంతోత్సవాలు




**కాకినాడ, (విశాఖ సమాచారమ్):** స్వాతంత్ర్య సమరయోధులు, భారత మాజీ ఉప ప్రధానమంత్రి డా. బాబూ జగ్జీవన్ రామ్ జయంతి ఉత్సవాలు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వ ర్యంలో ఘనంగా జరిగాయి. బుధవారం ఉదయం కాకినాడ లేడీస్ క్లబ్ సెంటరు లో గల డా. బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహానికి కాకినాడ పట్టణ శాసన సభ్యులు ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, రాష్ట్ర మాల కార్పొరేషన్ చైర్మన్ పి.అమ్మాజి, కుడా చైర్ పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, జెడ్పీ సీఈవో ఎన్.వి.వి. సత్యనారాయణ, డీఆర్వో కె.శ్రీధర్ రెడ్డి, అడిషనల్ ఎస్.పి. శ్రీనివాస్, కాకినాడ మునిసిపల్ కార్పొరేషన్ అదనపు కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడి డిఎస్ సునీత, మాజీ మేయర్ సుంకర శివ ప్రసన్న తదితరులు పూలమాలలతో అలంక రించి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ సామాజిక న్యాయం కోసం, బలహీన వర్గాల అభివృద్ధికి కృషి చేసిన గొప్ప వ్యక్తి బాబూ జగ్జీవన్ రామ్ అని పేర్కొన్నారు. జగ్జీవన్ రామ్ ఇచ్చిన దిశానిర్దేశంతో రాష్ట్ర గౌరవ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి తన పరిపాలనలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తున్నారన్నారు. ఇటువంటి మహనీయుల ఆదర్శాలు, ఆశయాలను పాలనలో ఆచరిస్తూ ముఖ్యమంత్రి పేద, బడుగు బలహీన వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా అనేక నూతన సంస్కరణలకు శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే, అదనపు ఎస్పీ, మాల కార్పొరేషన్ చైర్ పర్సన్ ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి కేక్ కట్ చేసారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ సభ్యులు దోకుబుర్ర భద్రం, డా. ఎం.పవన్ కుమార్, గంగవంసల త్రినాథ్ దేవ్, పిల్లి జ్యోతి, సాంఘిక సంక్షేమ శాఖ జేడీ జె.రంగలక్ష్మీదేవి, కాకినాడ అర్బన్ తహసీల్దార్ సీతాపతి రావు వివిధ ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గర్భిణీ,బాలింతల గృహ సందర్శన చేసిన డిఐఒ



**పార్వతీపురం,బలిజిపేట, (విశాఖ సమాచారమ్):** పి.చాకరాపల్లి, అజ్జాడ గ్రామాల్లో బుధవారం జిల్లా ఇమ్యు నైజేషన్ అధికారి(డి ఐ ఒ) డాక్టర్ టి. జగ న్మోహనరావు సందర్శించి పిల్లల వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పరిశీలించి గర్భిణీలు , బాలింతల ఆరోగ్య పర్య వేక్షణ చేశారు.టీకా కేంద్రంలో ఉండా ల్సిన వ్యాక్సిన్ కిట్ , అందులో వ్యాక్సిన్ శీతోష్ణ స్థితి , అత్యవసర మందుల కిట్ , హబ్ కట్టర్, టీకా అర్హుల జాబితాను పరిశీలించారు. అదేవిధంగా టీకా కార్డు లను పరిశీలించి గడువు తేదీలో టీకా వేస్తున్నది లేనిది పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. వేసవి కాలం లో పిల్లలు , గర్భిణీ లు పట్ల తీసుకో వాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం గర్భిణీ లు , బాలింతల గృహ సందర్శనలు చేసి అందుతున్న వైద్య సేవలపై అడిగి తెలుసుకున్నారు. అవసరమైన వారికి వైద్య సిబ్బందిచే పరీక్షలు చేయించి మందులు, ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు అందజేశారు. డీ హైడ్రేషన్ కు గురికాకుండా నీరు, మజ్జిగ, నిమ్మరసం, బార్లీ , ఓ ఆర్ ఎస్ మొదలగు ద్రావణాలను ఎప్పటికప్పుడు తీసుకోవాలని సూచించారు. వేసవి కాలం దృష్ట్యా గర్భిణీ లు , బాలింతలు అత్యవసరమైతే తప్ప దూర ప్రాంతాలు, బయటకు ఎక్కువగా వెళ్లరాదని తెలియజేస్తూ వైద్య సిబ్బంది ఎప్పటికప్పుడు గర్భిణీలు, బాలింతలు గృహ సందర్శనలు చేసి వైద్యాధికారులకు ఆరోగ్య నివేదికలను అందజేయాలని డిఐఒ జగన్మోహనరావు సూచించారు.ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పి. చిన్నమ్మలు, ఎమ్. సోనియా, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

# మహనీయుల బాటలో పయనించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలి



విజయనగరం: నేటి తరం యువత, విద్యార్థులు మహనీయుల జీవిత విశేషాలను తెలుసుకోవాలని.. అర్థం చేసుకోవాలని వారు ఆచరించిన, అనుసరించిన మార్గాల్లో పయనించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని విద్యార్థులను ఉద్దేశించి కలెక్టర్ ఎ. సూర్యకుమారి అన్నారు. బాబూ జగ్జీవన్ రామ్ 116వ జయంతి వేడుకలను కలెక్టరేట్ సమావేశ మందిరంలో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి విశిష్ట అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్సీ రఘురాజు, జిల్లా రెవెన్యూ అధికారి, ఇతర జిల్లా స్థాయి అధికారులతో కలిసి ఆమె బాబూ జగ్జీవన్ రామ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహనీయుల జీవిత పాఠాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని, వారి మాదిరిగా సమాజానికి సేవ చేయాలని హితవు పలికారు. ప్రతి ఒక్కరూ సామాజిక స్పృహను కలిగి ఉండాలన్నారు. బాబూ జగ్జీవన్ రామ్ లాంటి మహోన్నతమైన వ్యక్తుల గురించి ప్రసంగాలు కాకుండా ఆయన పాటించిన విధానాలను, పద్ధతులను ప్రతి ఒక్కరూ అనుసరించాలని సామాజిక చైతన్యం కలిగి ముందుకు సాగాలని సూచించారు. చదువు అనే మార్గాన్ని అనుసరించి ఆయన ఎన్నో పోరాటాలు చేశారని, స్వాతంత్ర్య స్ఫూర్తిని చాటి చెప్పారని గుర్తు చేశారు. అలాంటి వ్యక్తిని ఆదర్శంగా తీసుకొని గొప్ప స్థాయికి ఎదగాలని హితవు పలికారు. అరుపులు, కేకలతో ఏమీ సాధించలేమని, అకుంఠిత దీక్ష, ఆత్మ విశ్వాసంతోనే దేన్నైనా సాధించగలమని జయంతి వేడుకలకు హాజరైన విద్యార్థుల్లో కలెక్టర్ సూర్యకుమారి స్ఫూర్తి నింపారు. బాగా చదువుకోవాలని సమాజానికి సేవ చేసే అవకాశాన్ని కల్పించుకోవాలని సూచించారు. పది కాలాల పాటు మనల్ని గుర్తు పెట్టుకొనేలా జీవించాలని ఉపదేశించారు.

**చదువే అసలైన ఆయుధం...**

జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నా.. సామాజిక చైతన్యం తీసుకురావాలన్నా చదువే అసలైన ఆయుధమని విశిష్ట అతిథి ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. బాబూ జగ్జీవన్ రామ్ అణగారిన వర్గాల వారికి ఎన్నో రకాల సేవలందించారని, సమన్యాయం పాటించారని గుర్తు చేశారు. ఆయన బాటలో నడిచి నేటి తరం యువత, సంఘాల నాయకులు సమాజానికి మరింత సేవ చేయాలని హితవు పలికారు. జిల్లా కేంద్రంలో ఎక్కడా కూడా బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహం లేదని ప్రభుత్వం వారు స్థలం కేటాయించినట్లయితే ఆ మహనీయుడి విగ్రహాన్ని సంఘ నాయకులతో కలిసి ఏర్పాటు చేస్తామని ఈ సందర్భంగా రఘు రాజు అన్నారు.

జయంతి వేడుకల్లో భాగంగా జిల్లా రెవెన్యూ అధికారి ఎం. గణపతిరావు, జిల్లా పరిషత్ సీఈవో అశోక్ కుమార్, మెప్మా పీడీ సుధాకర్, దళిత సంఘ నాయకులు ప్రసంగించారు.

కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, ఎమ్మెల్సీ రఘురాజుతో పాటు, జిల్లా రెవెన్యూ అధికారి ఎం. గణపతిరావు, జడ్పీ సీఈవో అశోక్ కుమార్, మెప్మా పీడీ సుధాకర్, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రత్నం, ఆ శాఖ అధికారులు, సిబ్బంది, ఇతర విభాగాల అధికారులు, పలువురు దళిత సంఘాల నాయకులు, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## తెదేపా జోన్ వన్ సమావేశానికి హాజరైన పార్టీ అధినేత చంద్రబాబు



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): విశాఖపట్నం వీ కన్వెన్షన్ సెంటర్లో తెలుగుదేశం పార్టీ జోన్ వన్ సమావేశానికి తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు విచ్చేసిన సమావేశంలో రాష్ట్ర పార్టీ అధ్యక్షులు కింజరపు అచ్చన్న నాయుడు పొలిట్ బ్యూరో సభ్యులు అశోక్ గజపతిరాజు చింతకాయల అయ్యన్నపాత్రుడు అనకాపల్లి పార్లమెంట్ విశాఖపట్నం సమన్వయకర్త నిమ్మకాయల చినరాజప్ప మాజీ మంత్రివర్యులు కిమిడి కళా వెంకటరావు బండారు సత్యనారాయణమూర్తి అనకాపల్లి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బుద్ధ నాగ జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## తెలుగుదేశం పార్టీ సమావేశానికి తరలివెళ్లిన పరవాడ నాయకులు



పరవాడ, (విశాఖ సమాచారమ్): తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరుగుతున్న జోన్ 1 సమావేశానికి బుధవారం పరవాడ టిడిపి నాయకులు తరలి వెళ్లారు.

# 7న గిరిజన సదస్సు



పార్వతీపురం, (విశాఖ సమాచారమ్): :బెంతు ఒరియా, బోయ/వాల్మీకులను గిరిజన తెగల జాబితాలో కలపాలని రాష్ట్ర అసెంబ్లీలో చేసిన తీర్మానం రద్దు చేయాలని కోరుతూ ఈనెల 7(శుక్రవారం)పార్వతీపురం గిరిజన సామాజిక భవనంలోఉదయం పది గంటలకు జరుగుతున్న సదస్సులో గిరిజన యువత పాల్గొని విజయవంతం చేయాలని గిరిజన సంక్షేమ, నిరుద్యోగ సంఘాల నాయకులు తాడంగి సాయిబాబు, పాలక రంజిత్ కుమార్, ఆరిక ప్రభాకర్, ఉర్లక నాగార్జున కోరారు. ఈమేరకు పార్వతీపురం మండలం బొడ్డ వలస గిరిజన గ్రామంలో సదస్సు కరపత్రాలు విడుదల చేసారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తక్షణమే అసెంబ్లీలో చేసిన తీర్మానం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసారు.ఈ సదస్సు గిరిజన/ఆదివాసీ, రైతు, రైతుకూలీ,వ్యవసాయ కార్మిక సంఘాలు సంయుక్తంగా నిర్వహిస్తున్నాయని తెలిపారు.

# టిడిపి ద్వారానే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం



కాకినాడ, (విశాఖ సమాచారమ్): రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తేనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని టిడిపి నేతలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. బుధవారం కాకినాడ రూరల్ నేత టిడిపి నేత వాసిరెడ్డి ఏసుదాసు ఆధ్వర్యంలో అతని కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాకినాడ రూరల్ టిడిపి నేతలు వాసిరెడ్డి ఏసుదాసు, పేరాబత్తుల రాజశేఖర్, పెంకే శ్రీనివాస బాబాలు విలేకరులతో సమావేశంలో మాట్లాడారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుద్యోగులకు ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్ను విడుదల చేస్తామని, రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తానని హామీ ఇచ్చి గెలుపొందిన తర్వాత జగన్ వాటిని మర్చిపోయారన్నారు. అలాగే రాష్ట్రంలో లక్షా 74 వేల మంది ఉపాధ్యాయులు ఉండగా గడిచిన రెండేళ్ల కాలంలో 24 వేల మంది పదవీ విరమణ చేశారని తిరిగి మళ్లీ ఆ ఉపాధ్యాయ పోస్టులను నింపలేదన్నారు. అలాగే వైకాపా ప్రభుత్వం అవినీతిని చూసి రాష్ట్రంలో గడచిన నాలుగేళ్లలో ఏ ఒక్క పరిశ్రమ నిర్మించకపోగా పారిశ్రామికవేత్తలు సీఎం జగన్ అవినీతి చూసి రాష్ట్రం నుంచి పారిపోతున్నారన్నారు.

ఈ ఉభయ పదమూడు జిల్లాలో ఒక్క పరిశ్రమైన కట్టారా అని వారు ప్రశ్నించారు. విశాఖలో జరిగిన గ్లోబల్ సమ్మిట్లో పారిశ్రామికవేత్తలను ఆహ్వానించి లక్ష కోట్ల రూపాయలు పెట్టుబడులు పెడుతున్నారని మోసం చేసి, ఆసమ్మిట్కు తన తండ్రి చంపారని ఆరోపిస్తున్న అంబానీని జగన్ ఆహ్వానించారన్నారు. వైసీపీ నేతలు దోచుకోవడం దాచుకోవడంలో ముందున్నారని ఇసుక, మద్యం, మట్టి, భూకబ్జాలు ఇలా ఇటువంటి అక్రమాలు చేయడంలో ముందున్నారని వారు అన్నారు. వైకాపా నేతలు పాము చెప్పేవు నిజం కాదని నిరూపిస్తే ఆధారాలతో నిరూపిస్తామని దాసు, రాజశేఖర్, బాబాలు చెప్పారు.

ఈ సమావేశంలో టిడిపి రూరల్ మండల అధ్యక్షుడు రామదేవు సీతయ్య దొర, కాకరపల్లి చలపతిరావు, కరప మండల అధ్యక్షుడు దేవు వెంకన్న, మండల మహిళా అధ్యక్షురాలు కోన వెంకట లక్ష్మి, టిడిపి నాయకులు కోమర్తి కోటేశ్వరరావు, పబ్బిడి సోమరాజు, అడపా కామరాజు, గుబ్బల భాస్కర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

## దేశ మాజీ ఉపప్రధాని బాబుజగ్జీన్ కు నివాళులర్పించిన ఉపముఖ్యమంత్రి



దేవరాపల్లి, (విశాఖ సమాచారమ్): బాబు జగ్జీవన్ రామ్ 116వ జయంతి సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు తారువలోని క్యాంప్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను స్మరించుకుని, దళితులకు, బీసీలకు అణచివేత గురైన వర్గాల అభివృద్ధికి హక్కుల సాధనకు నిరంతరం పోరాటాలు, కార్మికుల ఉద్యమాలను ముందుండి నడిపారన్నారు. ఆయన స్ఫూర్తితో పేదలు వెనుకబడిన,గిరిజన, దళిత వర్గాల అభ్యున్నతి కోసం రాష్ట్ర వ్యాప్తంగా సీఎం జగన్ సారథ్యంలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సి.ఐ. తాతారావు, యస్,ఐ నాగేంద్ర, పలు పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఈనెల తొమ్మిదిన్న జరుగు శ్రీ హనుమాన్ శోభాయాత్ర ను జయప్రదం చేయండి



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): ఈనెల 9న నిర్వహించనున్న శ్రీ హనుమాన్ శోభాయాత్రను విజయవంతం చేయాల్సిందిగా స్థానిక హిమ శేఖర్ విద్యాసంస్థల అధినేత కొణతాల జనార్దన్ కోరారు. ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు స్థానిక సుంకర మెట్టవద్దనున్న శ్రీ సత్యనారాయణ స్వామి ఆలయం వద్ద నుండి శ్రీ హనుమాన్ శోభాయాత్ర కమిటీ ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా నిర్వహించబడుతుందని ఆయన తెలిపారు. అనకాపల్లి మెయిన్ రోడ్డు గుండా సాగే ఈ కార్యక్రమం కొత్తూరు ఫ్లై ఓవర్ బ్రిడ్జి 18 ఉన్న హనుమాన్ గుడి వద్దకు చేరుకుంటుందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో రోజురోజుకు హిందూ మతంపై అన్యమతస్తుల దాడులు పెరుగుతున్నాయని, హిందూ మత ఔన్నత్యాన్ని చాటే ఎందుకు హిందువులంతా ఏకం కావలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. పవిత్ర పుణ్యక్షేత్రాలు అయిన తిరుపతి అన్నవరం శ్రీకాళహస్తి వంటి దేవాలయాల్లో అన్యమతస్తులు ఉద్యోగులు పెత్తనం చెలా ఇస్తున్నారని హిందూ మత ఔన్నత్యాన్ని దెబ్బతీస్తున్నారు అన్నారు. జిల్లాలోని అన్ని ప్రాంతాల నుండి సుమారు 5000 మంది ఈ శోభాయాత్రలో పాల్గొంటారని అన్నారు. శోభాయాత్ర కమిటీ కన్వీనర్ పెంటకోట బాబురావు మాట్లాడుతూ సనాతన ధర్మం హిందూమతం గొప్పదనాన్ని భావితరాలకు తెలియజేయాలని ఉద్దేశంతోనే హనుమాన్ శోభ యాత్ర నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఏ మతాన్ని ఉద్దేశించి నిర్వహిస్తున్న కార్యక్రమం కాదని హనుమాన్ గొప్పతనాన్ని తెలియజేసేందుకు ప్రతి ఒక్కరు ఈ సాబయాత్రలో పాల్గొని హనుమాన్ సేవలో పాత్రులు కావాలని ఆయన కోరారు. ఇకపై ప్రతి సంవత్సరం కూడా శోభాయాత్ర నిర్వహించాలని నిర్ణయించామన్నారు. విశ్వ హిందు పరిషత్తు జిల్లా అధ్యక్షులు బంకుపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ హనుమాన్ శోభాయాత్ర వలన హిందూ మతం ఐక్యత పెరుగుతుందని, అన్నారు కార్యక్రమంలో సుదురుపాటి తాతాజీ, పైడి రత్నం తదితరులు పాల్గొన్నారు

# విద్య నైపుణ్యాభివృద్ధికి సింహాద్రి ఎన్టీపీసీ కృషి



పరవాడ, (విశాఖ సమాచారమ్): విద్య మరియు నైపుణ్యాభివృద్ధి కి సింహాద్రి ఎన్టీపీసీ సిఎస్ఆర్ కార్యకలాపాలలో ఎల్లప్పుడూ కృషి చేస్తుంది. ఇది పరిసర సమాజాల దీర్ఘకాలిక సమగ్ర అభివృద్ధిని లక్ష్యంగా చేసుకుని యువతీ యువకులకు సమగ్ర మరియు నాణ్యమైన విద్య మరియు నైపుణ్యం పెంపుదల అవకాశాలను నిర్ధారిస్తుంది. విద్య మరియు నైపుణ్యం రంగాలలో లబ్ధిదారుల అవసరాలను తీర్చడానికి ఎన్టీపీసీ నిరంతరం మౌలిక సదుపాయాలు, పాఠశాల మరుగుదొడ్లు, తరగతి గది సహాయాలు, స్మార్ట్ తరగతులు మరియు డ్రైవింగ్, కంప్యూటర్ ఆపరేషన్, ప్లాస్టిక్ టెక్నాలజీ, టైలరింగ్ మొదలైన అంశాలలో శిక్షణను అందించింది. కెపిఎంజి నిర్వహించిన సామాజిక ప్రభావ మూల్యాంకన అధ్యయనం ఎన్టీపీసీ సింహాద్రి పిల్లల హాజరు, క్రమబద్ధత, అభ్యాసం, నమోదు స్థాయిలతో సహా విద్య మరియు నైపుణ్యాభివృద్ధికి సంబంధించిన అనేక సూచికలపై సానుకూల ప్రభావాన్ని సృష్టించింది మరియు నైపుణ్యం పెంపుదల మరియు మరింతగా మారడంలో సహాయపడింది. ఉద్యోగయోగ్యమైనది. జివిఎంసి స్థానాల్లోని పరవాడ మండలం & 77వ వార్డులోని 88% గ్రామస్తులు పాఠశాలల్లో డ్రాపౌట్ రేటు తగ్గిందని మరియు 96% మంది బాలికల డ్రాపౌట్ రేటు ముఖ్యంగా తగ్గిందని పంచుకున్నారు. సానిటరీ న్యాప్‌కిన్‌ల సరఫరా, బాలికలకు ప్రత్యేక మరుగుదొడ్ల నిర్మాణం వంటివి బాలికా విద్యను పెంపొందించే దిశగా ముందుకు సాగుతున్నాయని లబ్ధిదారులు పంచుకున్నారు. అదనంగా, 96% మంది పిల్లల తల్లిదండ్రులు పాఠశాలకు వారి క్రమబద్ధత పెరిగినందున వారి పిల్లల అభ్యాస స్థాయి మొత్తం పెరిగినట్లు నివేదించారు మరియు సర్వేలో పాల్గొన్న 63% మంది లబ్ధిదారులు కూడా విద్య సంబంధిత వ్యయంలో సగటున అయ్యన్నార్ 2385 వార్షిక తగ్గింపును పేర్కొన్నారు. ఇంకా, స్కిల్ డెవలప్‌మెంట్ కోసం సర్వే చేయబడిన 85% మంది లబ్ధిదారులు, నైపుణ్యం అందించిన రంగాలలో తమ విశ్వాస స్థాయిని పెంచినట్లు వ్యక్తం చేశారు. ముఖ్యముగా, సర్వే చేయబడిన 50% మంది లబ్ధిదారులు నైపుణ్య జోక్యాల కారణంగా పంచుకున్నారు.

వాడచీపురుపల్లి, నాయుడుపాలెం, పరవాడ, వెన్నెలపాలెం, రావాడ, పిట్టవానిపాలెం యువతకు ఇప్పటి వరకు డేటా ఎంట్రీ, టైలరింగ్, ఎల్ఎంవీ డ్రైవింగ్ శిక్షణ ఇచ్చారు.

# డాక్టర్ జగ్జీవన్ రామ్ మహోన్నత నాయకుడు

## పరిశ్రమలు ఐటీ శాఖ మంత్రి జి.అమరనాథ్



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): మాజీ భారత ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ దేశం గర్వించదగ్గ మహోన్నత నాయకుడని పరిశ్రమలు ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ నివాళులర్పించారు. జగ్జీవన్ రామ్ 116వ జయంతి సందర్భంగా నగరంలోని నెహ్రూ చౌక్ దగ్గరలో గల జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దళితుల హక్కుల సాధనకు ఆయన ఎంతో కృషి చేశారన్నారు. గాంధీజీతో స్వాతంత్ర సమరంలో పాల్గొన్న ఆయన దేశ మొదటి క్యాబినెట్లో మంత్రిగా పనిచేశారని 1977 వరకు కేంద్రంలో అనేక శాఖల మంత్రిగా పనిచేశారన్నారు. 1979 వ సంవత్సరంలో దేశ ఉప ప్రధానిగా పనిచేశారన్నారు.జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి మాట్లాడుతూ బీహార్ వంటి వెనుకబడిన ప్రాంతం, ఎస్సీ అయిన జగ్జీవన్ రామ్ స్వయంకృషితో ఎదిగి కేంద్రంలో అనేక ప్రముఖ శాఖలను నిర్వహించారన్నారు. దళితుల అణచివేత పై ఆయన పోరాటం చేశారని చెప్పారు. ఆయన ఆశయాలను మనందరం ముందుకు తీసుకువెళ్లాలని చెప్పారు.కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి వీఆర్వో పి.వెంకటరమణ, ఆర్డీవో చిన్నికృష్ణ, సాంఘిక సంక్షేమ శాఖ డిడి అజయ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ జగ్జీవన్ రామ్ స్ఫూర్తితో దేశసేవ చేయాలి



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ స్ఫూర్తితో ప్రతివారు దేశానికి సేవ చేయాలని జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గుండాల వద్ద గల జీవీఎంసీ సచివాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 116 వ జయంతి ఉత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం సభలో మాట్లాడుతూ జగ్జీవన్ రామ్ దేశంలోని యువతకు ఆదర్శంగా నిలిచారని, చిన్న వయసులోనే భారతదేశ మొదటి క్యాబినెట్లో మంత్రిగా పనిచేశారని చెప్పారు. సుదీర్ఘకాలం వివిధ శాఖలను నిర్వహించిన ఆయన విప్లవాత్మకమైన నిర్ణయాలు సంస్కరణలు తీసుకువచ్చారన్నారు. అటువంటి వారిని ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరూ తమవంతుగా దేశం రాష్ట్రం లేదా సమాజాభివృద్ధికి మంచి పని చేయాలన్నారు. దేశ ఉప ప్రధానిగా పనిచేసిన ఆయనను ప్రేరణగా తీసుకొని సమాజంలో ఉన్న అసమానతలు మూఢ నమ్మకాలను పారద్రోలాలన్నారు. దళితుల పట్ల వివక్ష చిన్నచూపు, అస్పృశ్యతలపై పోరాటం చేసేందుకు దళిత ప్రజలను సంఘటితపరిచారని చెప్పారు. తరువాత స్వాతంత్ర పోరాటంలో పాల్గొన్నారని కేంద్ర మంత్రిగా దేశానికి ఎనలేని సేవలు అందించాలని కొనియాడారు.జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి మాట్లాడుతూ సంకల్పం ఉంటే విజ్ఞానం సంపాదించేందుకు, పదిమందికి మంచి చేసేందుకు సాంఘిక అసమానతలు అడ్డురావని జగ్జీవన్ రామ్ నిరూపించారన్నారు. వ్యవసాయ మంత్రిగా రవాణా మంత్రిగా ఆయా శాఖల ఆధునీకరణ చేసి ప్రజలకు అందుబాటులోనికి తీసుకువచ్చారని చెప్పారు.

వైస్ జడ్పీపి బీవీ సత్యవతి, డిఆర్ఓ పి. వెంకటరమణ, జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు కే.అప్పారావు, ఎం అప్పలరాజు, ఆర్ మధుబాబు ప్రసంగించారు.

నర్సీపట్నం ఎస్సీ బాలికల వసతిగృహం, కసింకోట సమగ్ర సంక్షేమ వసతి గృహ బాలికలు చేసిన నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి.

ఈ సమావేశంలో డి.ఎస్.పి మల్లేశ్వరరావు, సాంఘిక సంక్షేమ శాఖ ఉపసంచాలకులు అజయ్ బాబు, ఏ టి డబ్ల్యూ ఓ శిరీష తదితరులు పాల్గొన్నారు.

## 6న మంత్రి బొత్స సత్యనారాయణ నగరంలో పర్యటన

విజయనగరం: రాష్ట్ర విద్యా శాఖ మంత్రి శ్రీ బొత్స సత్యనారాయణ గురువారం జిల్లాలో పర్యటించనున్నారు. మంత్రి బుధవారం రాత్రి నగరంలోని తన నివాసానికి చేరుకుంటారు. 6వ తేదీ ఉదయం 9-45 గంటలకు ద్వారపూడిలో ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ప్రారంభిస్తారు. 11-30 గంటలకు ఐస్ ఫ్యాక్టరీ జంక్షన్ వద్ద దండి సత్యాగ్రహం కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 2-30 గంటలకు బయలుదేరి విశాఖ మీదుగా సాయంత్రానికి విజయవాడ చేరుకుంటారు.

# ఈ 6 అలవాట్లు ఉంటే.. మిమ్మల్ని రోగాలు రౌండప్ చేస్తాయ్..!



మనం ఆరోగ్యంగా ఉండటానికి.. ఆరోగ్యకరమైన అలవాట్లను అలవర్చుకోవడం చాలా అవసరం. శుభ్రత పట్ల శ్రద్ధ వహించకపోవడం, ఆహారం తీసుకునేప్పుడు కొన్ని చెడు అలవాట్లు అనారోగ్యానికి గురి చేస్తాయి. చాలా మంది వాళ్ళు తీసుకునే ఆహారం, డ్రింక్స్ పట్ల శ్రద్ధ తీసుకుంటూ ఉంటారు, హెల్తీ అలవాట్లను అనుసరిస్తూ ఉంటారు. అయినప్పటికీ వారు అనారోగ్యానికి గురవుతూ ఉంటారు. దీని వెనుక కారణం ఏమిటని మీరు ఎప్పుడైనా ఆలోచించారా? నిజానికి, మనం తీసుకునే ఆహారం, ఆహారం తీసుకునేప్పుడు కొన్ని అలవాట్ల కారణంగా తీవ్రమైన వ్యాధులకు గురయ్యే ప్రమాదం ఉంది. ఈ అలవాట్లు మిమ్మల్ని అనారోగ్యానికి గురిచేస్తూ ఉంటాయి.

**సరిగ్గా ఉడకని ఆహారం తినడం..** సరిగ్గా ఉడకని అన్న తింటే అనారోగ్యలకు గురయ్యే అవకాశం ఉంది. ఈ విషయం మీకు ఆశ్చర్యంగా ఉన్నా. ఇది నిజం. వరిలో బి. సెరియస్ ఉంటుంది, ఇవి సాధారణంగా మట్టిలో కనిపిస్తాయి. అన్నం బాగా ఉడికితే.. ఈ బ్యాక్టీరియా మరణిస్తుంది, కానీ సరిగ్గా ఉండకని అన్నంలో ఈ బ్యాక్టీరియా బతికే ఉంటుంది. ఈ బ్యాక్టీరియా కారణంగా అరోగ్య సమస్యలు ఎదురయ్యే ప్రమాదం ఉందని చెబుతున్నారు.

**తిన్న వెంటనే బ్రష్ చేయడం:** తిన్న వెంటనే బ్రష్ చేస్తే.. నోట్లో క్రిములు నాశనం అవుతాయని మనకు తెలుసు. కానీ పుల్లని పదార్థాలను తిన్న వెంటనే పళ్లు శుభ్రం చేసుకుంటే.. వాటిపై ఎనామిల్ దెబ్బతింటుంది. కొలంబియా యూనివర్శిటీ నివేదిక ప్రకారం, పుల్లని తిన్న వెంటనే పళు శుబ్రం చేసుకోవడం హానికరం. మీరు తిన్న తర్వాత కనీసం 30 నిమిషాల గ్యాప్ ఇచ్చి పళ్లు శుభ్రం చేసుకోవాలి.

**మైక్రోవేవ్ పాప్‌కార్న్..** సినిమా చూస్తూ పాప్‌కార్న్ తినడానికి ఎవరు ఇష్టపడరు. అయితే, మైక్రోవేవ్ పాప్‌కార్న్ ఊపిరితిత్తులకు హాని చేస్తుందని నిపుణులు అంటున్నారు. మైక్రోవేవ్ పాప్‌కార్న్‌ను రుచిగా మార్చడానికి డయాసిటైల్ అనే రసాయనం ఉపయోగిస్తారు. ఇది ఊపిరితిత్తుల ఆహ్యానికి హాని చేస్తుంది.

**నిల్వ బంగాళాదుంపలు తినొద్దు..** బంగాళాదుంపలో విటమిన్ సి, పొటాషియం, యాంటీ ఆక్సిడెంట్, ఫ్లేవనాయిడ్లు, కెరోటినాయిడ్లు, ఫినోలిక్ యాసిడ్ వంటి పోషకాలు మెండుగా ఉంటాయి. చాలా మంది ఆలూను ఇష్టంగా తింటూ ఉంటారు. అయితే, నిల్వ ఉన్న బంగాళాదుంపలు తినడం ఆరోగ్యానికి మంచిది కాదని నిపుణులు అంటున్నారు. బంగాళదుంపలు సోలనిన్ అనే విష పదార్థం ఉంటుంది. ఈ విషపదార్థం.. పెరగడం వల్ల బంగాళాదుంప లోపలి భాగం ఆకుపచ్చగా మారుతుంది. వీటిని తినడం వల్ల కడుపులో నొప్పి, వాంతులు, జ్వరం వంటి ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయి. కొన్ని అరుదైన సందర్భాల్లో పక్షవాతం వచ్చే ప్రమాదం ఉంది.

**ట్యాప్ వాటర్‌తో ముఖం శుభ్రం చేసుకుంటున్నారా..?** ట్యాప్ వాటర్ చర్మాన్ని దెబ్బతీస్తుంది. మీరు టాప్ వాటర్‌తో ముఖాన్ని శుభ్రం చేసుకునే ముందు.. నీటి pH స్థాయిని చెక్ చేయండి. ఇది సుమారు 4.7 ఉండాలి. దాని pH స్థాయి 5 కంటే ఎక్కువ ఉంటే, చర్మం దెబ్బతింటుంది. ట్యాప్ వాటర్‌లో కాల్షియం, మెగ్నీషియం, ఐరన్ వంటి కఠినమైన మినరల్స్ ఉంటాయి. ఇవి చర్మం పగుళ్లు, పొడి చర్మానికి కారణం అవతాయి.

**టైట్ బట్టలు వేసుకోవడం..** బిగుతుగా ఉండే దుస్తులు ధరించడం వల్ల జీర్ణకోశ సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. బిగుతుగా ఉండే దుస్తులు కడుపు, ప్రేగులపై ఒత్తిడిని కలిగిస్తాయి, ఇది జీర్ణవ్యవస్థను నెమ్మదిస్తుంది. అలాగే ఇది ఈస్ట్ ఇన్ఫెక్షన్, నరాల నొప్పికి దారి తీస్తుంది.

# వేసవి తాపాన్ని తట్టుకోలేకపోతున్నారా?



ఎండాకాలం రాగానే ఎండలు మనల్ని దహించివేస్తాయి. ఎండ వేడిని తట్టుకోలేకపోతున్నాం. ఈ కాలంలో మనం శరీరాన్ని చల్లగా ఉంచుకోవడానికి ఏం చేయాలో ఎక్కువగా ఆలోచిస్తాం. ఎందుకంటే శరీరంలోని వేడి అనేక వ్యాధులను కలిగిస్తుంది మరియు శరీరంలో డీహైడ్రేషన్‌ను కలిగిస్తుంది. ఇది మిమ్మల్ని బాగా అలసిపోయేలా చేస్తుంది. అలాగే కడుపు సంబంధిత సమస్యలు కూడా సర్వసాధారణం. అధిక వేడి వల్ల డయేరియా, వాంతులు వంటి సమస్యలు వస్తాయి.

ఈ స్థితిలో, మీరు జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచడానికి మరియు శరీరాన్ని చల్లగా, ఆరోగ్యంగా ఉంచే ఆహారాలను ఎక్కువగా తీసుకోవాలి. ఈ సమయంలో, మనం వేయించిన ఆహారాన్ని తినకూడదు. ఎందుకంటే వేసవిలో వేయించిన ఆహారాన్ని తినడం వల్ల కడుపు సమస్యలు పెరుగుతాయి.

ఈ వేసవిలో శరీరాన్ని వేడి నుండి రక్షించడం మరియు శరీరాన్ని హైడ్రేట్ గా ఉంచడం చాలా ముఖ్యం. అందుకోసం చల్లటి ఆహార పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. ఇది శరీరాన్ని చల్లబరుస్తుంది మరియు హీట్ స్ట్రోక్ నుండి మిమ్మల్ని రక్షిస్తుంది. వేసవిలో మీ శరీరాన్ని సులభంగా చల్లగా ఉంచడంలో సహాయపడే ఆహారాలు తెలుసుకోండి.

పుచ్చకాయ వేసవిలో పిల్లల నుంచి పెద్దల వరకు అందరూ ఇష్టపడే పండు పుచ్చకాయ. ఇందులో నీటి శాతం ఎక్కువగా ఉంటుంది. అందువల్ల, ఈ పుచ్చకాయ శరీరాన్ని ఎక్కువ సమయం హైడ్రేట్ గా మరియు చల్లగా ఉంచడంలో సహాయపడుతుంది. పుచ్చకాయలోని లైకోపీన్ చర్మాన్ని ఎండ దెబ్బతినకుండా కాపాడుతుంది. ఇది తిన్న వెంటనే మీకు ఆకలి అనిపించదు. మీ పొట్టను చల్లగా ఉంచడంలో పుచ్చకాయ చాలా సహాయపడుతుంది.

దోసకాయ ఒక ప్రసిద్ధ కూరగాయ. ఇది నీరు మరియు పోషకాలతో నిండి ఉంది. ఇది మీ కడుపుని చల్లబరచడానికి గొప్ప ఆహారం అవుతుంది. ఈ వెజిటేబుల్‌లో కేలరీలు తక్కువగా ఉన్నందున, వేసవి నెలల్లో ఆరోగ్యకరమైన బరువును మెయింటైన్ చేయాలనుకునే వారికి ఇది గొప్ప చిరుతిండి. కీరదోసకాయలో పీచు ఎక్కువగా ఉంటుంది. ఇది జీర్ణక్రియను ప్రోత్సహిస్తుంది మరియు మలబద్ధకాన్ని నివారిస్తుంది. ఇది మీ శరీరంలో నీటి శాతాన్ని పెంచుతుంది. దోసకాయ తినడం వల్ల శరీరం చల్లగా ఉంటుంది మరియు వేసవి వేడి నుండి మీ పొట్టను చల్లగా ఉంచుతుంది.

అనాస పండు ఇది సహజమైన స్మూతీ బూస్టర్. ఇందులో బ్రోమెలైన్ అనే ఎంజైమ్ ఉంటుంది, ఇది సన్ బర్న్ వల్ల శరీరంలో మంటను నివారిస్తుంది. ఇందులో విటమిన్ సి, విటమిన్ బి6, ఫైబర్, ఫోలేట్, పాంథోనిక్ యాసిడ్, మాంగనీస్ మరియు విటమిన్ బి1 కూడా ఉన్నాయి.

పోషక పానీయం సత్తు పానం ఒక సాంప్రదాయ భారతీయ పానీయం. ఇది శతాబ్దాలుగా, ముఖ్యంగా వేసవిలో విరివిగా వినియోగించబడుతోంది. ఇది చాలా నీటిని కలిగి ఉన్నందున, ఈ పానీయం హైడ్రేషన్ యొక్క అద్భుతమైన మూలం. పోషక పానీయం తాగడం వల్ల కోల్పోయిన ద్రవాలను తిరిగి నింపడంలో సహాయపడుతుంది మరియు వేడి వేసవి నెలల్లో నిర్జలీకరణాన్ని నిరోధించవచ్చు. పోషకాలు ప్రోటీన్, ఫైబర్, కాల్షియం, ఇనుము మరియు మెగ్నీషియంతో సహా పోషకాల యొక్క గొప్ప మూలం. అలాగే ఈ డ్రింక్ తీసుకోవడం వల్ల మీ రోజువారీ పోషకాహార అవసరాలను తీర్చడంలో మరియు శరీరానికి అవసరమైన శక్తిని అందించడంలో సహాయపడుతుంది. ఈ పానీయం శరీరాన్ని చల్లబరుస్తుంది మరియు వేడి నుండి ఉపశమనం అందిస్తుంది.

పెరుగు ప్రోబయోటిక్స్ అధికంగా ఉండే ఆహారం. ఇది జీర్ణక్రియను మెరుగుపరచడంలో మరియు కడుపులో ఉబ్బరాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది. క్యాల్షియం పుష్కలంగా ఉన్న పెరుగు మీ ఎముకలు మరియు దంతాలను బలోపేతం చేయడానికి సహాయపడుతుంది. పెరుగు ప్రోటీన్ యొక్క అద్భుతమైన మూలం కాబట్టి, వేసవి నెలల్లో ఆరోగ్యకరమైన బరువును కొనసాగించాలనుకునే వారికి ఇది గొప్ప చిరుతిండి.

నిమ్మకాయ మన శరీరంలోని టాక్సిన్స్‌ను బయటకు పంపడంలో నిమ్మకాయ ముఖ్యమైనది. కేవలం నిమ్మరసం, నీళ్ల కలిపి తాగితే ఎలాంటి రోగాలు దరిచేరవని వైద్యులు చెబుతున్నారు. ఎందుకంటే ఇది రోగనిరోధక శక్తిని పెంచి చర్మాన్ని అందంగా ఉంచడంలో సహాయపడుతుంది.

గుండెల్లో మంట లేదా కడుపు చికాకు మీ సాధారణ రోజును ప్రభావితం చేసే అసౌకర్య పరిస్థితి. అయితే, పైన పేర్కొన్న ఆహారాలను మీ ఆహారంలో చేర్చుకోవడం వల్ల మీ పొట్టను చల్లబరుస్తుంది మరియు కడుపు వేడికి సంబంధించిన అసౌకర్య లక్షణాల నుండి ఉపశమనం పొందవచ్చు.

# దంతాలు ఆరోగ్యంగా ఉండాలంటే ఇలా చేయండి



నోటిని ఆరోగ్యంగా ఉంచుకోవాలనే విషయంలో మాత్రం మనం పెద్దగా పట్టించుకోం. అకస్మాత్తుగా పంటి నొప్పి వచ్చినప్పుడు అర్థమవుతుంది.. దంతాలను ఎంత శుభ్రంగా ఉంచుకోవాలో అని. ఉదయం నిద్ర లేచిన తర్వాత పళ్లు తోముకోవడంతోనే చాలామంది సరిపుచ్చుతుంటారు. వాస్తవానికి రాత్రి నిద్రకు ఉపక్రమించేముందూ పళ్లు తోముకోవడం తప్పనిసరి. అంతేకాదు.. ఆహారపు అలవాట్ల పరంగా ఎంతో జాగ్రత్తగా ఉండాలి అంటుకుపోయే పదార్థాలకు దూరంగా ఉండాలి. ఇది చాలా ముఖ్యమైన విషయం. ఎందుకంటే పళ్లకు అంటుకుపోయే పదార్థాలు ఒక పట్టాన పోకుండా హానికర బ్యాక్టీరియా పెరగడానికి కారణమవుతాయి. చాక్లెట్లు, బిస్కెట్ల వంటివి తిన్నప్పుడు అవి అంటుకుపోతాయి. అవి తిన్నప్పుడు పళ్లను పూర్తిగా శుభ్రం చేసుకోవాలనే విషయాన్ని మాత్రం మరవద్దు.

పుక్కిలించటం చేయాలి. అన్నం తిన్న ప్రతిసారీ నీటితో నోటిని బాగా పుక్కిలించాలి. దీనివల్ల పళ్ల మధ్యలో చిక్కుకున్న పదార్థాలు తొలగిపోవడమే కాకుండా బ్యాక్టీరియా పెరుగుతుంది.

పుల్లటి పదార్థాలు మితంగా తీసుకోవాలి. నిమ్మ, ద్రాక్ష, పైనాపిల్, దానిమ్మ వంటి పుల్లటి పండ్లు తీసుకోవడం ఆరోగ్యానికి ఎంతో మేలు. వీటిలోని ఆమ్లంతో పళ్ల మీది ఎనామిల్ దెబ్బతినే అవకాశం ఉంది. కాబట్టి వీటిని తినే విషయంలో ఎంతో జాగ్రత్తగా ఉండాలి. పుల్లటి పదార్థాలను తిన్నప్పుడు నీటితో పుక్కిలించడంవల్ల ఆమ్లం గాఢత తగ్గుతుంది. వెంటనే పళ్ల తోముకోకుండా అరగంట తర్వాత తోముకోవాలి. అప్పుడు ఎనామిల్ కుదుటపడుతుంది.

నీరు ఎక్కువగా తాగుతుండాలి. మనకు నీరే అమృతం. తగినంత నీరు తాగితే ఆరోగ్యం అన్ని విధాలుగా బాగుంటుంది. నోరు తడారకుండా చూస్తూ పళ్లకూ మేలు చేస్తుంది.

చూయింగ్ గమ్‌ను నమిలితే ముఖ కండరాలకు వ్యాయామం కలుగుతుంది. రక్త ప్రసరణ కూడా మెరుగవుతుంది. అంతేకాదు ఒత్తిడిని తగ్గిస్తుంది. అయితే గమ్‌లోని చక్కెర పళ్లను దెబ్బతీస్తుంది కాబట్టి చక్కెరలేని గమ్‌ను నమలటం ఉత్తమం. దీనివల్ల నోట్లో లాలాజలం బాగా ఊరి పళ్లను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుతుంది.

# రోటీలను డైరెక్ట్‌గా మంటపై కాల్చితే క్యాన్సర్ వస్తుందా..



రోటిని డైరెక్ట్‌గా మంటపై పెట్టి పుల్కాల్లా కాల్చుతారు చాలామంది. దీని వల్ల కొన్ని హానికరమైన పదార్థాలు ఉత్పత్తి అవుతాయని, ఇవి మానవ శరీరానికి ప్రమాదమని చెబుతున్నాయి కొన్ని పరిశోధనలు. మరి దీని గురించి పూర్తి వివరాలు తెలుసుకుందాం.

ఆహారంలో ముఖ్య భాగం రోటి..

రోటి అనేది ఆహారంలో ముఖ్య భాగం. మనకంటే ఎక్కువగా నార్త్‌లో ఉండే వారు అన్నం కంటే ఎక్కువగా చపాతీలు తింటారు. మనకి అన్నం ఎలానో.. వీరికి రోటీలు అలా. ఈజీగా తయారయ్యే ఈ చపాతీలను కూర, చట్నీ ఎందులో అయినా తినొచ్చు.

**తయారు చేయడం..** అయితే, చాలా మంది దీనిని చేసేటప్పుడు ముందుగా ఓ పాన్‌పై కాసేపు వేడి చేసి డైరెక్ట్‌గా మంటపై పెట్టి కాలుస్తారు. ఇది రోటి చేసేవారికి కామన్. అయితే, ఆశ్చర్యకర విషయాలు చెబుతోంది. రోటీలను డైరెక్ట్‌గా స్టౌ పై పెట్టి కాల్చడం వల్ల క్యాన్సర్ వస్తుందని చెబుతోంది.

జర్నల్ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ అండ్ టెక్నాలజీలో పబ్లిష్ అయిన గ్యాస్ స్టౌ వాయు కాలుష్యాన్ని విడుదల చేస్తాయి. ఈ కాలుష్య కారకాలు కార్బన్ మోనాక్సైడ్, నైట్రోజన్ డయాక్సైడ్, శ్వాస కోశ, గుండె జబ్బుల ప్రమాదాన్ని కలిగిస్తాయి. అంతేనా, దీని వల్ల క్యాన్సర్ వచ్చే రిస్క్ కూడా పెరుగుతుంది.

**మరో పరిశోధన ప్రకారం..** న్యూట్రిషన్ అండ్ క్యాన్సర్ జర్నల్‌లో పబ్లిష్ అయిన ఎక్కువ మంటపై వంట చేయడం, దానిని తీసుకోవడం అస్సలు మంచిది కాదని, ఇది క్యాన్సర్ కారకాలను ఉత్పత్తి చేస్తుంది.

**ముందురోజుల్లో..** ముందు రోజుల్లో రోటిని కాల్చేప్పుడు ఏదైనా గుడ్డతో రోటీపై నొక్కేవారు. దీంతో రోటీ మొత్తం బాగా కాలేది. కానీ, పటకారు వచ్చాక.. చాలా మంది రోటీని మంటపైనే కాలుస్తున్నారు. ఈజీగా ఉండడం, రోటీ అన్నివైపులా త్వరగా కాలి పని ఈజీ అవ్వడం వల్ల చాలా మంది ఇలానే చేస్తున్నారు.

సైంటిస్ట్ ప్రకారం..

ఫుడ్ స్టాండర్డ్స్ ఆస్ట్రేలియా అండ్ రోటీని మంటపై కాల్చినప్పుడు అది అక్రిలమైడ అనే కెమికల్‌ని రిలీజ్ చేస్తుంది.

అంతే కాకుండా, పిండిలోని సహజ చక్కెర, ప్రోటీన్ కూడా తగ్గి అలా కాల్చిన రోటీలను తినడం మంచిది కాదని చెబుతోంది.

**అధ్యయనాలు అవసరం..** అందుబాటులో విషయం ప్రకారం.. నేరుగా మంటపై చేసి రోటీలు తినడం వల్ల క్యాన్సర్ వస్తుంది. ఇది పూర్తిగా నిజమా అనే విషయం గురించి తెలుసుకోవడానికి మరి కొన్ని పరిశోధనలు అవసరమని నిపుణుల చెబుతున్నారు.

**రోటీ మాత్రమే కాదు..** మాంసం, చేపలు, పౌల్ట్రీ ఇవన్నీ కూడా ఎక్కువ మంటపై వండడం అస్సలు మంచిది కాదు. ఇది క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచుతుంది. హాంబర్గర్స్‌ని ఎక్కువగా తినేవారిలో ప్రొస్టేట్ క్యాన్సర్ ఎక్కువగా వచ్చే అవకాశం ఉంటుందని ఓ పరిశోధన చెబుతోంది.

# ఈ ఆహారాలు వేసవిలో కొలెస్ట్రాల్‌ను అదుపులో ఉంచుతాయి



ఆరోగ్యకరమైన కణాలను నిర్మించడానికి మన శరీరానికి కొలెస్ట్రాల్ అవసరం, కానీ అధిక కొలెస్ట్రాల్ స్థాయిలు గుండె జబ్బుల వంటి తీవ్రమైన ఆరోగ్య పరిస్థితుల ప్రమాదాన్ని పెంచుతాయి.

కొలెస్ట్రాల్‌లో రెండు ప్రధాన రకాలు ఉన్నాయి. తక్కువ సాంద్రత కలిగిన లిపోప్రొటీన్ చెడు కొలెస్ట్రాల్, మరియు మరొకటి అధిక సాంద్రత కలిగిన లిపోప్రొటీన్, ఇది మంచి కొలెస్ట్రాల్. చాలా ఎక్కువ కొలెస్ట్రాల్ మీ రక్త నాళాలలో కొవ్వు నిల్వలను పెంచుతుంది. సరైన చర్యలు తీసుకోకపోతే, ఈ కొవ్వు నిల్వలు ఏర్పడి ధమనులలో రక్త ప్రవాహాన్ని నిరోధించవచ్చు. కొన్నిసార్లు, ఈ నిక్షేపాలు గుండెపోటు లేదా స్ట్రోక్‌కు కారణమయ్యే గడ్డను ఏర్పరుస్తాయి.

ఊబకాయం వంశపారంపర్యంగా ఉంటుంది, కానీ సాధారణంగా అనారోగ్యకరమైన జీవనశైలి ఎంపికల వల్ల వస్తుంది. మంచి విషయం ఏమిటంటే, జీవనశైలి మార్పుల ద్వారా, వీటిని తిప్పికొట్టవచ్చు మరియు సంభావ్య ఆరోగ్య ప్రమాదాలను నివారించవచ్చు. అధిక కొలెస్ట్రాల్ స్థాయిలను నివారించడంలో ముఖ్యమైన అంశాలలో ఒకటి మీరు తినే ఆహారం.

కొలెస్ట్రాల్‌లో ఆహారం పాత్ర మీ ఆహారం మీ కొలెస్ట్రాల్ స్థాయిలపై శక్తివంతమైన ప్రభావాన్ని చూపుతుంది. మీరు మీ తక్కువ-సాంద్రత కలిగిన లిపోప్రొటీన్ కొలెస్ట్రాల్ స్థాయిలను సహజంగా తగ్గించాలనుకుంటే, మీరు మీ రోజువారీ ఆహారంలో అనేక రకాల ఆరోగ్యకరమైన మరియు పోషకమైన ఆహారాలను చేర్చుకోవాలి మరియు ప్యాక్ చేసిన మరియు ప్రాసెస్ చేసిన ఆహారాలను కొనుగోలు చేయడం, నిల్వ చేయడం లేదా తినడం మానుకోండి. కొలెస్ట్రాల్‌ను తగ్గించే ఈ సహజ మార్గం ఆరోగ్యకరమైనది మరియు మందులు తీసుకోవడం కాకుండా, ఇది ఎటువంటి దుష్ప్రభావాల ప్రమాదాన్ని నివారిస్తుంది. మీ ఆహారం నుండి అనారోగ్యకరమైన వస్తువులను భర్తీ చేయడమే కాకుండా, మీరు మీ రోజువారీ ఆహారంలో చేర్చుకోవాల్సిన కొన్ని ఆహారాలు కూడా ఉన్నాయి.

వోట్స్ మరియు బార్లీ వోట్స్ మరియు బార్లీ వంటి తృణధాన్యాలు బీటా గ్లూకాన్ అని పిలువబడే కరిగే ఫైబర్‌లో అధికంగా ఉంటాయి, ఇది మీ సిస్టమ్‌లో శోషించబడిన కొలెస్ట్రాల్ మొత్తాన్ని తగ్గిస్తుంది. 45 అధ్యయనాల సమీక్షలో, ప్రతిరోజూ మూడు సేర్విన్గ్స్ తృణధాన్యాలు తినడం వల్ల గుండె జబ్బులు మరియు స్ట్రోక్ వచ్చే ప్రమాదం 20% తగ్గింది. రోజుకు ఏడు సేర్విన్గ్స్ తృణధాన్యాలు పెంచడం మంచిది. మీ ఉదయం ఆరోగ్యకరమైన ప్రారంభం కోసం మీరు ఆరోగ్యకరమైన ఓట్ మీల్ అల్పాహారాన్ని తయారు చేసుకోవచ్చు మరియు రుచి మరియు పోషక విలువలను పెంచడానికి విటమిన్ అధికంగా ఉండే పండ్లు మరియు బెర్రీలను జోడించవచ్చు.

గింజలు బాదం మరియు వాల్‌నట్ వంటి గింజలను మీ రోజువారీ ఆహారంలో అల్పాహారంగా లేదా సాయంత్రం స్నాక్‌గా చేర్చుకోవచ్చు. వాటిలో పోషకాలు పుష్కలంగా ఉంటాయి మరియు మోనోఅన్‌శాచురేటెడ్ మరియు పాలీఅన్‌శాచురేటెడ్ కొవ్వులు అధికంగా ఉంటాయి, ఇవి గుండె ఆరోగ్యానికి మేలు చేస్తాయి మరియు రక్తపోటును నియంత్రిస్తాయి. రెండు ఔన్సుల గింజలను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల ఎల్‌డిఎల్‌ను 5% తగ్గించవచ్చు. రోజూ నట్స్ తినడం వల్ల గుండె జబ్బులు వచ్చే ప్రమాదం 28% తగ్గుతుంది.

అవకాడో అవోకాడోలు కొలెస్ట్రాల్-తగ్గించే లక్షణాలను కలిగి ఉన్నాయి, ఇవి అనేక క్లినికల్ అధ్యయనాలచే మద్దతు ఇవ్వబడ్డాయి. ఎందుకంటే అవి మోనోశాచురేటెడ్ కొవ్వులు మరియు ఫైబర్ యొక్క గొప్ప మూలం. పరిశోధన ప్రకారం, అధిక బరువు ఉన్నవారు తమ ఆహారంలో రోజుకు ఒక అవకాడోని జోడించడం ద్వారా వారి LDL కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గించవచ్చు. మీరు అవోకాడో ముక్కలను తినవచ్చు లేదా వాటిని సలాడ్లు మరియు శాండ్విచ్లకు జోడించవచ్చు.

నేరేడు పండు ఈ పండు ఫైబర్ యొక్క గొప్ప మూలం. ఫైబర్ శరీరంలోని కొలెస్ట్రాల్ స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. నేరేడు పండ్లలో ఉండే అధిక బీటా కెరోటిన్ కంటెంట్ ఎల్‌డిఎల్ కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడుతుంది మరియు ధమనులు అడ్డుపడకుండా చేస్తుంది. వేడితో పాటు, ఎండిన ఆప్రికాట్లను మీ శీతాకాలపు ఆహారంలో సులభంగా చేర్చుకోవచ్చు.


రాస్ప్బెర్రీ-స్ట్రాబెర్రీ ఈ ఎరుపు రంగు పండు అనేక ప్రయోజనాలను కలిగి ఉంది. స్ట్రాబెర్రీలు మరియు రాస్ప్బెర్రీస్ వివిధ రకాల ఖనిజాలను కలిగి ఉంటాయి. స్ట్రాబెర్రీలు మెగ్నీషియం మరియు ఫాస్పరస్ నుండి యాంటీఆక్సిడెంట్లతో నిండి ఉన్నాయి. అందుకే ఈ పండు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. ఈ పండు కొలెస్ట్రాల్-నియంత్రణ ఫైబర్ యొక్క అద్భుతమైన మూలం. ఈ చిన్న పండ్లలో విటమిన్ సి, విటమిన్ బి2, ఫోలేట్, నియాసిన్, మెగ్నీషియం, పొటాషియం మరియు రాగి వంటి అనేక యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు మరియు ఖనిజాలు ఉన్నాయి. ఈ పండు వేసవిలో ఎక్కువగా లభిస్తుంది, నవంబర్‌లో దేశవ్యాప్తంగా కోరిందకాయలను ఉత్పత్తి చేస్తారు.

తోటకూర ఈ అధిక-ఫైబర్ వెజిటేబుల్‌లో సపోనిన్స్ అని పిలువబడే సమ్మేళనాలు కూడా ఉన్నాయి, ఇవి యాంటీ ఇన్ఫ్లమేటరీ మరియు యాంటీ కార్సినోజెనిక్ లక్షణాలను కలిగి ఉన్నట్లు చూపబడింది. ఇందులో క్యాన్సర్ నిరోధక గుణాలు ఉన్నాయి. రక్తపోటు స్థాయిలను అదుపులో ఉంచుకోవడమే కాకుండా, సాధారణ వినియోగం చక్కెర నియంత్రణ మరియు రక్త కొలెస్ట్రాల్ స్థాయిలతో ముడిపడి ఉంటుంది.

ఫ్యాటీ ఫిష్ సాల్మన్ వంటి కొవ్వు చేపలు, పొడవైన గొలుసు ఒమేగా-3 కొవ్వు ఆమ్లాల యొక్క అద్భుతమైన మూలం. ఇవి మీ గుండెకు ఆరోగ్యకరమైనవి ఎందుకంటే అవి HDL లేదా మంచి కొలెస్ట్రాల్ స్థాయిలను పెంచుతాయి మరియు వాపు మరియు స్ట్రోక్ ప్రమాదాన్ని తగ్గిస్తాయి. ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు LDL కొలెస్ట్రాల్ స్థాయిలను ప్రభావితం చేయవు, కానీ గతంలో గుండెపోటు ఉన్నవారిలో ఆకస్మిక మరణ ప్రమాదాన్ని తగ్గించవచ్చు.

పప్పులు ఇవి బీన్స్, బఠానీలు మరియు కాయధాన్యాలతో సహా మొక్కల ఆహారాల సమూహం. ఈ ఆహారాలలో ప్రోటీన్, ఫైబర్ మరియు ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. శుద్ధి చేసిన ధాన్యాలు మరియు ప్రాసెస్ చేసిన మాంసాలను తినడానికి బదులు, మీ రోజువారీ లంచ్ లేదా డిన్నర్‌లో ఈ ఆహారాలతో సహా తయారు చేసిన ఆహారాలు మీ గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించగలవు. 26 యాదృచ్ఛిక నియంత్రిత ట్రయల్స్ యొక్క సమీక్షలో ప్రతిరోజూ 1/2 కప్పు చిక్కుళ్ళు తినడం వల్ల ఎటువంటి చిక్కుళ్ళు తినడం కంటే చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడుతుందని తేలింది.

## జగ్జీవన్ రామ్ జీవితం అందరికీ ఆదర్శ ప్రాయం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఈరోజు బాబూ జగ్జీవన్ రామ్ 116 జయంతి సందర్భంగా బీచ్ రోడ్ లో గల విగ్రహం వద్ద వేడుకలు జరిగాయి. బీజేపీ ఎస్సీ మోర్చ విశాఖ జిల్లా అధ్యక్షులు కోడూరి సంజీవరావు ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పలువురు నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ, నేటి యువత జగ్జీవన్ రామ్ బాటలో నడవాలి అని కోరారు. ఆయన జీవితం అందరికీ ఆదర్శ ప్రాయం అని కొనియాడారు.

ఈ కార్యక్రమంలో బిజెపి విశాఖ పార్లమెంట్ జిల్లా అధ్యక్షులు శ్రీ ఎం రవీంద్ర, యువ మోర్చ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ సురేంద్ర మోహన్, ఎస్సీ మోర్చ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీ కే ఎన్ పి చక్రవర్తి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీ దిలీప్ వర్మ, అనకాపల్లి బీజేపీ ఇంఛార్జి శ్రీ ప్రకాష్ రెడ్డి, ఎస్సీ మోర్చ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## పెయిందొర పేట రామాలయంలో భారీ అన్నదాన కార్యక్రమం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** పెయిందొర పేట, దూరం వారి వీధిలో గల రామాలయంలో శ్రీరామనవమి ఉత్సవాల ముగింపు సందర్భంగా భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించబడింది. 46 సంవత్సరాలుగా ఈ రామాలయంలో శ్రీరామనవమి ఉత్సవాలు భారీ ఎత్తున నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాల్లో భాగంగా 5000 మందికి ఈరోజు ఈరోజు భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రముఖ సంఘ సేవకులు, వైఎస్ఆర్‌సీపీ యువ నాయకులు ద్రోణం రాజు. శ్రీవత్సవ గారు ముఖ్య అతిథిగా విచ్చేసి, ఈ అన్నదానం ప్రారంభించారు. ఆలయ వ్యవస్థాపకులు చింతపల్లి. శంకర్రావు గారు, ముత్యాల గారు ఆలయ కమిటీ సభ్యులు చింతపల్లి పోతురాజు గారు, చింతపల్లి నూకరాజు గారు,%వా.=.జ్రా%. నాయకులు రవీంద్ర భరత్ గారు పాల్గొన్నారు. శ్రీవత్స గారు మాట్లాడుతూ, 46వ అన్న సమారాధన కార్యక్రమంలో పాల్గొనడం, ఇంతమంది భక్తుల సేవలో పాల్గొనడం నా అదృష్టమని, ఇంతకుముందు మా తండ్రిగారైన ద్రోణం రాజు. శ్రీనివాసరావు గారు పాల్గొనేవారు, అని తెలియజేశారు. ఈ సందర్భంగా, చింతపల్లి పోతురాజు గారు మాట్లాడుతూ, శ్రీరామనవమి ఉత్సవాల్లో సేవలు అందించిన ప్రతి ఒక్కరికి ఈ అన్నదాన కార్యక్రమానికి సహాయ సహకారాలు అందించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేశారు.

# అచ్యుతాపురం మండలం చోడపల్లి గ్రామంలో అక్రమాలు కబ్జాలు

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలం చోడపల్లి గ్రామంలో మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి వియ్యంకుడు కుండా భాస్కర్ రెడ్డి వేసిన లేఔట్ లో అడుగడుగునా అక్రమాలు, కబ్జాలు ఉన్నాయని మరో మారు స్పష్టం చేస్తున్నాం. ఇందులో సెంటు భూమి కబ్జా ఉన్నా లేఅవుట్ ను వదులుకుంటానంటూ కుండా భాస్కర్ రెడ్డి ఒంగోలులో విలేకరుల సమావేశంలో చేసిన సవాలను స్వీకరిస్తున్నాం. భాస్కర్ రెడ్డి సవాల్ స్వీకరించి కబ్జా నిరూపించేందుకు మేము సిద్ధం. ఆయన కోరినట్టుగా ప్రజల సమక్షంలో సర్వే జరిపి వాస్తవాలను ప్రజల ముందు ఉంచాల్సిందిగా సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నాం.

డాక్యుమెంట్లు ఆధారంగా స్థానిక ప్రజల సమక్షంలో సంయుక్త డిజిటల్ సర్వే జరపాలి

మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి అండదండలతో అటవీ, రెవెన్యూ, పంచాయతీరాజ్ చెరువు భూములను కబ్జా చేసి లేఔట్ లో కలిపేసుకున్న కొండ భాస్కర్ రెడ్డి లేఔట్ చుట్టూ నిబంధనలకు విరుద్ధంగా ప్రహరీ గోడ నిర్మించి అధికారులకు సువర్ణ అవకాశం కల్పించారు. ఆయన సవాలకు అధికారులు స్పందించి ఆయన నిర్మించిన గోడల మధ్య ఉన్న భూభాగాన్ని కొలిచి వాస్తవాలను ప్రజల ముందు ఉంచాలి. డాక్యుమెంట్ల ఆధారంగా కొనుగోలు చేసిన భూమెంత? ఆయన నిర్మించిన గోడల మధ్య ఉన్న భూమి విస్తీర్ణం ఎంత? తెలియజేయాలి. ఇందుకోసం ప్రజల సమక్షంలో రెవెన్యూ ,అటవీ , పంచాయతీరాజ్ శాఖ పట్టణ అభివృద్ధి శాఖ అధికారులు సంయుక్తంగా డిజిటల్ సర్వే నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నాం. ఈ సర్వేలో భాస్కర్ రెడ్డి ఎటువంటి కబ్జాకు పాల్పడలేదని రుజువైతే రాజకీయాలనుంచి శాశ్వతంగా తప్పుకోవడంతోపాటు చట్ట పరంగా ఎటువంటి శిక్ష కైనా సిద్ధమని ప్రతి సవాలు విసురుతున్నాం. కబ్జా నిరూపితమైతే ఆయన ఈ లే అవుట్ ను జగనన్న కాలనీ కోసం ప్రభుత్వానికి అప్పగించాలి

**మాజీ మంత్రి బాలినేని ప్రమేయాన్ని కాదనలేం**

2009 లో అనుమతులు పొందిన ఈ లేఔట్ కి 2011లో తనకు వియ్యంకుడైన బాలినేని శ్రీనివాస రెడ్డికి ఎటువంటి సంబంధం లేదని భాస్కర్ రెడ్డి చెబుతున్నారు. వియ్యంకులు కాకముందే బాలినేని.. భాస్కర్ రెడ్డి స్నేహితులు. ఇద్దరు ప్రకాశం జిల్లాకే చెందినవారు. 2009లో లేఅవుట్ అనుమతులు పొందే నాటికి లేని అక్రమాలు బాలినేని మంత్రి అయిన తర్వాతే జరిగాయి. భాస్కర్ రెడ్డి తెలివిగా ఫారెస్ట్ భూమి ఎలా రిజిస్ట్రేషన్ అవుతుందని ప్రశ్నించారు. రిజిస్ట్రేషన్ కాదు కబ్జా అయిందన్నదే మా ఆరోపణ. బాలినేని ఆయన అటవీ శాఖ మంత్రిగా ఉండగానే నిబంధనల ప్రకారం ఏడు మీటర్ల బఫర్ జోన్ వదలకుండా మరో 8 మీటర్లు రిజర్వ్ ఫారెస్ట్ భూమి కలుపుకొని గోడ నిర్మించారు. బాలినేని మంత్రిగా ఉన్న కారణంగానే ఎవరు అడ్డు చెప్పలేదు. బాలినేని మంత్రిగా ఉండగానే లేఔట్ కు అనుకొని ఉన్న ధర్మకోనేరు చెరువు ను పూడ్చి వంద నుంచి 120 అడుగుల మేర రహదారి నిర్మించారు. అంతకుముందు కేవలం కాలిబాట మాత్రమే ఉన్న ఈ ప్రాంతంలో 100 అడుగుల రహదారి నిర్మించడం కేవలం లేఔట్ ప్రయోజనాల కోసమే. చెరువు పక్కన ఉన్న ఆలయానికి మరో మార్గంలో వెళ్లేందుకు తప్ప ఈ రహదారి ఎందుకు ఉపయోగపడదు. రహదారి చివరలో చిన్నపాటి కాలువ ఉన్నందున సంవత్సరంలో 9 నెలల పాటు నడక దారి సౌకర్యం కూడా వుండదు.. అటువంటి చోట 100 అడుగులు నిర్మించడం కేవలం లేఔట్ విలువ పెంచుకోవడానికే. ఇందుకు ఆర్ బ్ల్యూఎస్ నుంచి కూడా అనుమతులు తీసుకోలేదు. అడవిలో నుంచి వచ్చే జంతువుల రక్షణ కోసం చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మించి అని చెప్తున్న భాస్కర్ రెడ్డి అసాంఘిక కార్యకలాపాలు అడ్డగా మారిన ఈ చెరువు గట్టు వద్ద మాత్రం గోడ కట్టకుండా వదిలేయడం గమనార్హం. లేఔట్ పక్కన సర్వే నెంబర్ 175 లోని ప్రభుత్వ భూమిని 2009లోనే ఆక్రమించే ప్రయత్నం చేయగా అప్పటి అధికారులు అడ్డుకోవడంతో భాస్కర్ రెడ్డి వెనక్కి తగ్గారని వార్తలు కూడా వచ్చాయి. ఆ తర్వాత అదే భూమిని మంత్రి బాలినేని అండతో కబ్జా చేశారు.

**సర్వేనెంబర్ 175 లో నాలుగు ఎకరాలకు పైగా కబ్జా**

లేఔట్ అనుకొని నెంబర్ 175 లో 4.86 ఎకరాలను భాస్కర్ రెడ్డి కబ్జా చేసినట్టు స్థానికులు చెబుతున్నారు. తాజాగా పత్రికల్లో ఆ కబ్జా వార్తలు వచ్చాయి. ఈ కబ్జాని భాస్కర్ రెడ్డి ఎలా కాదంటారు? సర్వేనెంబర్ 174 లో ఉన్న ధర్మకోనేరు చెరువును భాస్కర్ రెడ్డి కబ్జా చేసి రహదారి నిర్మించారు. చెరువును కొంతమేర పూడ్చివేశారు. అలాగే సర్వేనెంబర్ 220, 222, 224 లలో రిజర్వ్ ఫారెస్ట్ భూమి కబ్జాకు గురైంది. బాలినేని అటవీ శాఖ మంత్రిగా ఉండటంతో అటవీ శాఖ అధికారులు ఎవరూ కన్నెత్తి చూడటం లేదు. ఈ కబ్జా కారణంగా చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అటవీ ప్రాంతంలో పశువులను మేపుకోవటం కూడా సాధ్యం కావడం లేదు. రక్షణ గోడలు నిర్మించింది కారణంగా సహజ సిద్ధంగా ఉన్న నీటిగడ్డలకు అంతరాయం ఏర్పడింది. ప్రభుత్వ భూములు లేఅవుట్కు పశ్చిమ దిక్కున ఉండటంతో అటువైపు మాత్రమే కబ్జా జరిగింది. తూర్పు వైపున ప్రైవేట్ భూములు కావడంతో ఏమి చేయలేకపోయారు.

**లేఔట్ ఇంతకాలం రద్దు చేయకపోవడానికి కారణం ఏమిటి?**

అక్రమ లేఔట్ లు, నిబంధనలకు విరుద్ధంగా వున్న వాటి కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ప్రొక్లైనర్ వాటి గోడలను కూల్చివేసిన వి ఎం ఆర్ డి ఏ అధికారులు అక్రమాలకు నిలయమైన భాస్కర్ రెడ్డి లేఔట్ వంక ఇంతకాలం కన్నెత్తి కూడా చూడలేదు. 2009లో ఆమోదం పొందిన ఈ లే అవుట్ లో రహదారులను రెండు నెలలలో పంచాయతీకి బదిలీ చేయాలి. బ్లాక్ టాప్ రోడ్లు, విద్యుత్ స్తంభాలు, డ్రైనేజీ వంటి సదుపాయాలు ఏర్పాటు చేయాలి. అవేమీ లేవు. విచిత్రంగా లే అవుట్ ఆమోదం పొంది 14 సంవత్సరాలు గడిచినా క్షేత్రస్థాయిలో ప్లాట్లు విభజన జరగలేదు. కేవలం పేపర్ మీద ప్లాట్లు కనపడతాయి. అక్కడకు వెళ్ళి చూస్తే బొప్పాయి, కొబ్బరి,, జామా ,నిమ్మ తోటలు కనిపిస్తాయి. ఒక మూల నిర్మిస్తున్న అపార్ట్మెంట్ల కోసం వేసిన 80 అడుగుల రోడ్డు మినహా మిగతా భాగం లేఔట్ గానే అనిపించదు. మ్యాప్ లో ఐదు పార్కులు ప్రతిపాదించినప్పటికీ అక్కడ రెండే కనిపిస్తున్నాయి. అయినా సంబంధిత అధికారులు మంత్రి బాలినేని పలుకుబడి కారణంగా ఇంతకాలం నిద్ర నటించారు. లేఔట్ అక్రమాలను బయటపెట్టిన తర్వాత ఇప్పుడు హడావుడిగా తనిఖీలు ప్రారంభించారు. ఇప్పటికైనా అధికారులు బాలినేని, భాస్కర్ రెడ్డిల చెర నుంచి బయటపడి నిజాయితీగా నిష్పక్షపాతంగా వ్యవహరించాలి. నిబంధనల మేరకు అనుమతి లేకుండా నిర్మించిన ప్రహరీ గోడలను తొలగించి లే అవుట్ అనుమతులను రద్దు చేయాలి.

భాస్కర్ రెడ్డి చెప్పినట్టు బాలినేని ప్రమేయం లేదు అని ఇకనైనా భావించి అధికారులు చట్టప్రకారం వ్యవహరించాలి.

కొండ భాస్కర్ రెడ్డి పత్రికా విలేకరుల సమావేశంలో ప్రకటించినట్టుగా మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస్ రెడ్డి ప్రమేయం లేదని అధికారులు భావించి వాస్తవాలను వెలికి తీసేందుకు రంగంలోకి దిగాలి. రిజర్వ్ ఫారెస్ట్ చట్టం, భూ రక్షణ చట్టం. వాల్టా చట్టం. లేఅవుట్ నిబంధనలను ఈ లేఔట్ లో నిష్పక్షపాతంగా అమలు జరపాలి.

**అక్రమ లావాదేవీల కోసమే లే అవుట్**

మరో విషయం ఏమంటే ఈ లేఔట్ ను ప్లాట్ల విక్రయించే వ్యాపారం కోసం గాక మనీ లాండరింగ్, అక్రమ ఆర్థిక లావాదేవీల కోసం వేసినట్లు అనుమానాలు కలుగుతున్నాయి. అందుకే ఇంతవరకు బల్క్ గా మినహా విడివిడిగా ప్లాట్లు విక్రయించిన దాఖలాలు కనిపించడం లేదు. ప్లాట్ల విభజన జరగలేదు. ఇందుకోసం మార్కెటింగ్ లేదు., అనుమానాలన్నింటిని నివృత్తి చేసుకునేందుకు ఈ లేఔట్ ఆధారంగా జరిగిన ఆర్థిక అంశాలపై, దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఆ వివరాలు కూడా సేకరించి త్వరలో మీ ముందు ఉంచుతామని తెలియజేస్తున్నాం.

భాస్కర్ రెడ్డి ఒంగోలులో వేసిన మరో లేఔట్ కూడా వివాదాస్పదంగా మారింది. ఏకంగా బాధిత రైతులు జిల్లా కలెక్టర్ ఫిర్యాదు కి చేశారు. చివరికి ఆయన స్వగ్రామం బిట్రగుంటలో స్మశానం స్థలాన్ని కబ్జా చేసి గోడ కట్టినట్టు ఆరోపణలు ఎదుర్కొన్నారు. అన్నిటి పైన దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

## పోలమాంబ అమ్మవారిని దర్శించుకున్న మంత్రి అమర్నాథ్



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** పట్టణంలోని చిన్న వాల్తేరులోని శ్రీ కరక చెట్టు పోలమాంబ అమ్మవారిని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ మంగళవారం దర్శించుకున్నారు. అమ్మవారి వార్షిక జాతర మహోత్సవాల సందర్భంగా ఆయన పోలమాంబ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అధికారులు, ట్రస్ట్ బోర్డు సభ్యులు, వేద పండితులు మంత్రి అమర్నాథ్ కు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మంత్రి అమర్నాథ్ ను వేద పండితులు ఆశీర్వదించి ప్రసాదం, వస్త్రాలను బహుకరించారు. మంత్రి అమర్నాథ్ తో పాటు వీఎంఆర్డీఏ చైర్ పర్సన్ అక్కరమాని విజయనిర్మల తదితరులు పాల్గొన్నారు.

## దళిత వర్గాల ఆశాజ్యోతి డా. బాబు జగ్జీవన్ రామ్ జయంతోత్సవాలు

### సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టరు రమణమూర్తి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** నవభారత నిర్మాణంలో అవిరళ కృషిచేసిన మహనీయుడు డా. బాబు జగ్జీవన్ రామ్ అని సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టరు రమణమూర్తి అన్నారు. బుధవారం ఉదయం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో డా. బాబు జగ్జీవన్ రామ్ 116వ జయంతోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సంధర్భంగా జాయింట్ డైరెక్టరు రమణమూర్తి మాట్లాడుతూ దళితులకు సంక్షేమ ఫలాలను అందించడం కోసం నిరంతరం కృషి చేసిన మహా వ్యక్తి డా. బాబు జగ్జీవన్ రామ్ అన్నారు. పంచాయితీరాజ్ వ్యవస్థ ను భారత దేశంలో సంపూర్ణంగా అమలుచేశారని తెలిపారు. బీహరు రాష్ట్రంలో కుగ్రామంలో జన్మించి దేశ అత్యున్నత పదవులలో ఒకటి అయిన ఉపప్రధాని వరకు ఎన్నో పదవులను అలంకరించారన్నారు. దళిత ప్రజలను సంఘటిత పరుస్తూ, వారికి జరిగే అన్యాయాలకు వ్యతిరేకంగా పోరటం చేసే వారని అన్నారు.

జిల్లా పరిషత్ డిప్యూటి సీఇఒ సత్య నారయణ మాట్లాడుతూ సూమారు 40 సంవత్సారాల పాటు దేశ వ్యవహారాలలో చురుకుగా పాల్గొంటూ ఎన్నో పదవులను అలంకరించారని దేశ పరిపాలన విధానాలలో కీలక నిర్ణయాలు తీసుకున్నారన్నారు.

ఈ కార్యక్రమంలో జీవియంసి సభ్యులు పూండి మల్లేశ్వరరావు, జోసఫ్, దళిత నాయకులు రామారావు, సాంఘిక సంక్షేమ శాఖ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## భారీగా నాటు సారా స్వాధీనం



**పార్వతీపురం, (విశాఖ సమాచారమ్):** పార్వతీపురం మన్యం జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ వి. విద్యా సాగర్ స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో అడిషనల్ ఎస్పీ దిలీప్ కిరణ్ వారి ఆదేశాల మేరకు ఎన్ఫోర్స్మెంట్ ఇన్స్పెక్టర్ యల్. ఉపేంద్ర ఆధ్వర్యంలో పార్వతీపురం మండలం బొడ్డవలస గ్రామంలో నాటు సారా అమ్ముతున్న పీడిక అప్పన్న అను వ్యక్తిని అదుపులోకి తీసుకుని 510 లీటర్ల నాటు సారాతో పాటు ద్విచక్ర వాహనంను సీజ్ చేసి, విచారణ లో అక్రమంగా సారా సరఫరా చేస్తున్న ఒడిషా రాష్ట్రం జగ్గుడా గ్రామానికి చెందిన కద్రక. రామన్నపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలపడమైంది. అలాగే పార్వతీపురం ఈయస్టీఫ్ టీమ్ మరియు ఏపీయస్పి టీమ్ సంయుక్తంగా పార్వతీపురం మండలం బాలగుడబ గ్రామ సమీపంలో దాడులు జరిపి 360 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకుని, అదే గ్రామానికి చెందిన బంగారి.వెంకట్, సిరిపురపు. ప్రశాంత్,బంగారి. ఆర్జున్ఏతవుడు నాటు సారా సరఫరాదారుడు ఒడిషా రాష్ట్రం చోరిపల్లి గ్రామానికి చెందిన భాలుఏబల్లులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలపడమైనది. ఈ దాడుల్లో స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో సబ్ ఇన్స్పెక్టర్లు శేఖరం, రమణ , రాజశేఖర్, ఏపీఎస్పీ సిబ్బంది యస్ఈబి సిబ్బంది పాల్గొన్నారు.




VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : S.Veerabhadra Rao , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press Door No. 9-3-16,Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345,
Visakhapatnam : Cell : 9346314199, Hyderabad : Cell : 9030841841, Kakinada : Cell: 7013118088, Simhachalam : Cell: 96660 15921,
Paravaada : Cell: 77804 33919, Aarilova : Cell: 97050 51389, Cheedikaada : Cell: 97686 33999, Gaajuwaaka : Cell: 70139 78488